Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 42 • 2-10-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

స్మైల్ సూపర్ స్పెషాలిటీ

• ఈ కార్డు ద్వారా జీవితాంతం కుటుంబసభ్యుల (నలుగురు) ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులో 30% రాయితీ.

• ప్రభుత్వ ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులకు రిటైర్డ్ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సదుపాయం.

SMILE 30%

ఫోన్ : 0861-2330949, 2344693

కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మరియు రిటైర్డ్ ఉద్యోగుల ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చును తిరిగి పొందే (రీయింబర్స్‌మెంట్) సదుపాయం కలదు.

డా॥ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, MDS, Asst. Professor Endodontics

పొగతోట, నెల్లూరు - ఫోన్ : 2303300

● అధిష్ఠానం ముందు తలదించిన వైఎస్.జగన్

## ఓర్పే శరణ్యం

ఎట్టకేలకు, చిట్టచివరకు కాంగ్రెస్ అధిష్ఠానానికే అంతిమ విజయం సిద్ధించింది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణించిన మరుక్షణం నుంచి ముఖ్యమంత్రి పదవి కోసం సర్వశక్తులూ ఒడ్డి పోరాడిన వైఎస్.జగన్ తలదించక తప్పలేదు. అధిష్ఠానం కరుణిస్తే తప్ప, సోనియాగాంధీ దయ చూపితే తప్ప తనకు పదవి దక్కే అవకాశంలేదన్న నిష్ఠురనిజాన్ని చాలా ఆలస్యంగా అర్థం చేసుకొన్నాడు జగన్.

కాంగ్రెస్‌పార్టీలో తమది తిరుగులేని ఆధిక్యత కాబట్టి, వైఎస్ మరణం తర్వాత ముఖ్యమంత్రి పదవి తన వారసత్వ హక్కు అన్న ధోరణిలో నెల రోజులపాటు నిర్విరామంగా పోరాటం చేశాడు జగన్. కెవిపి రామచంద్రరావు రాజకీయ చాణక్యం మహిమవల్ల అధిష్ఠానం ఆయనకు ఆ పదవిని పువ్వుల్లో పెట్టి అప్పచెప్పుందని వైఎస్ వర్గం మొత్తం భ్రమపడింది. కానీ అధిష్ఠానం ఆలోచనలు అందుకు విరుద్ధంగా నడిచాయి. జగన్ అంత స్వతంత్రించి వ్యవహరించడం ఢిల్లీలోని ఏ అగ్ర నాయకుడికీ నచ్చలేదు. తమది జాతీయపార్టీ కాబట్టి, ఏ రాష్ట్ర నాయకులైనా తమ చెప్పుచేతలలో వుండాలన్నది వారి అభిలాష. తాము చెప్పిన వాడికే పదవి దక్కాలన్నది వారి పట్టుదల. అట్లా జరగకుంటే మొగల్ సామ్రాజ్యాన్ని సామంతు రాజులు పతనం చేసినట్లుగా కాంగ్రెస్ పార్టీని రాష్ట్రస్థాయిలో బలం కల్గిన నాయకులు నిర్వీర్యం చేస్తారన్నది భయం. ఇందిరాగాంధీ హయాం నుంచి ఒక సాంప్రదాయంగా వస్తున్న ఆ కాంగ్రెస్ సంస్కృతిని అర్థం చేసుకోలేకపోవడం, దాన్ని అధిగమించగలమనుకోవడం జగన్ చేసిన తప్పిదం. ఆ తప్పుకు చాలా పెద్ద పరిహారం చెల్లించక తప్పడం లేదిప్పుడు.

కాంగ్రెస్ కోర్ కమిటీలోని ప్రణబ్‌ముఖర్జీ, చిదంబరం, అహ్మద్ పటేల్, ఎకె.ఆంటోనీ వంటి వారందరూ జగన్ ముఖ్యమంత్రిత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని స్పష్టమై పోయింది. సోనియాగాంధీ ఆలోచన ఎట్లా వుందో ఎవరికీ తెలియదు కానీ ఆమె రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేసే కోర్ కమిటీ సభ్యులలో అధిక సంఖ్యాకులు జగన్‌కు అనుకూలురుగా లేరని స్పష్టం కావడం జగన్ శిబిరాన్ని హతాశులను చేసింది. చివరకు ప్రధాని మన్మోహన్‌సింగ్ సైతం అదే పట్టుదలతో వుండడంతో జగన్ అనుకూలవాదులు డీలా పడిపోయారు. ఒక్కసారిగా అధిష్ఠాన పెద్దలందరూ జగన్ పట్ల విముఖత చూపడం ఎందువల్ల జరిగిందో ఎవరికీ అర్థం కావడం లేదు. వైఎస్ ప్రతికూలశక్తులు మూకుమ్మడిగా వీరి మనసులలో విషం నింపాయా లేక ఇంగ్లీషు దినపత్రికలు,



టివి ఛానళ్లు చేసిన ప్రచారం అధిష్ఠానాన్ని ప్రభావితం చేసిందా అన్నది బోధపడడం లేదు. వైఎస్ బ్రతికి వున్నంతకాలం వీరందరూ తనతో సన్నిహితంగా, స్నేహపూరితంగా వున్నారు కాబట్టి; వైఎస్ తరపున తాను మోసుకవెళ్లిన కప్పాన్ని తన చేతుల మీదుగానే స్వీకరించారు కాబట్టి, తాను వెళ్లి అడిగి అడగగానే జగన్ ముఖ్యమంత్రిత్వానికి అంగీకారం తెలుపుతారని ఆశపడ్డాడు కెవిపి రామచంద్రరావు. కానీ ఆయన అంచనా పూర్తిగా తలక్రిందులైపోయింది.

వైఎస్ కోసం ప్రాణాలివ్వడానికి కూడా సిద్ధపడే ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో వుండడం కూడా జగన్‌కు ఒక అనర్థత కావడం విచిత్రం. జగన్‌కు ముఖ్యమంత్రిత్వం ఇవ్వకుంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని ఒకరు, పార్టీని చీలుస్తామని వేరొకరు, రాజీనామాలు చేస్తామని కొందరు, మంత్రిత్వాలు వదలుకొంటామని మరికొందరు వీరావేశంతో చేసిన ప్రకటనలు; జిల్లా స్థాయిలో చేసిన ఆగడాలు అధిష్ఠానానికి కోపం తెప్పించాయి. ఈ అరాచక ధోరణిని అనుమతిస్తే, ఆ ఒత్తిడికి లొంగితే అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్

కొరవ 14వ పేజీలో

## నన్నపనేని సందడి!

ముఖ్యమంత్రి రోశయ్య ఆఫీసులో తెలుగుదేశం మహిళా నేత నన్నపనేని రాజకుమారి సందడి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఆమె గుంటూరుజిల్లా వాసి. రోశయ్య గారిది కూడా అదే జిల్లా. మీది తెనాలి, నాది తెనాలి అంటూ రాజకుమారి ముఖ్యమంత్రి కార్యాలయానికి ప్రతిరోజూ వస్తున్నారు. ఆయనకు సన్నిహితంగా మెలగుతున్నట్లు కనపడడానికి ప్రయత్నిస్తున్నారు. మొన్నకరోజు ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక గురించి మాట్లాడడానికి జి.వెంకటస్వామి కుమారులు వినోద్, వివేక్‌లు ఇద్దరూ రోశయ్య వద్దకు వచ్చారట. ఆ సమయానికి రాజకుమారి అక్కడ ప్రత్యక్షమైంది. ముఖ్యమంత్రి వీరిద్దరు కాంగ్రెస్‌వాదులకంటే ముందు ఆమెను పిలిచి మాట్లాడారట. మాకంటే ఆమె ఎక్కువైపోయిందా అని గొణుగుతూ బాధపడ్డారు వారిద్దరూ.

మరొక తెలుగుదేశం మహిళా నేత, మాజీ సినీ నటి కవిత కూడా తరచు ముఖ్యమంత్రి కార్యాలయం సందర్శించడాన్ని కూడా విశేషంగా చెప్పుకొన్నారు కాంగ్రెస్ వాదులు.

## కార్టూన్ స్కోప్




బెదిరింపు కాల్ కాదు సార్...
మీ బంధువులట.

## సుబ్రహ్మణ్యం సొత్తు పరాధీనం

వైఎస్.రాజశేఖర్‌రెడ్డితో పాటు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఐఎఎస్ అధికారి సుబ్రహ్మణ్యం సంపాదనలో అధికభాగం పరాధీనమైనట్లు వదంతిగా వుంది. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రి పేషీలో కార్యదర్శిగా తిరుగులేని అధికారం అనుభవించిన అధికారి ఆయన. పట్టణ ప్రాంతంలోని భూముల క్రమబద్ధీకరణ, మునిసిపల్ వ్యవహారాల వంటి విలువైన శాఖల మీద పెత్తనం చేశాడు. ఈ క్రమంలో ఆయన సంపాదన 200 కోట్ల రూపాయల వరకు వుందని వినికిడి. అయితే ఆయన మరణానంతరం ఈ డబ్బు ఎక్కడ వున్నదీ అర్థం కావడంలేదట. ఆయనతో జవహర్‌భారతి కాలేజీలో చదువుకొన్న సహాధ్యాయి, హైదరాబాద్ జూబ్లీ హిల్స్ నివాసి అయిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద పెద్ద మొత్తంలో సొమ్ము దాచాడని, అయితే ఆ వ్యక్తి ఇప్పుడు తన దగ్గర ఏమీ లేదని చెప్తున్నాడని వదంతిగా వుంది. సుబ్రహ్మణ్యానికి సన్నిహితులైన ఐఎఎస్ అధికారులు ఆ వ్యక్తిని నిర్బంధించి, నిజం చెప్పమని ఒత్తిడి చేస్తున్నారట.

నెల్లూరు జిల్లాలో తన ప్రాబల్యాన్ని పెంచుకొనేందుకు సుబ్రహ్మణ్యం "బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్" అనే సంస్థను స్థాపించాడు. పనబాక కృష్ణయ్య, ఐఎఎస్ అధికారులు కొప్పోలురాజు, పరశురాం, ఇన్‌కంటాక్స్ అధికారి మాల్యాద్రి వంటి వారందరూ ఇందులో సభ్యులు. అయితే సుబ్రహ్మణ్యం మరణంతో వీరిమధ్య విభేదాలు వచ్చాయని చెప్తున్నారు. వీరి వేర్పాటుకు సుబ్రహ్మణ్యం సొత్తు పంపకంలో విభేదాలే కారణమని తెలుస్తున్నది. దానితో ఆ సంస్థను రద్దు చేసి, పనబాక కృష్ణయ్య ఒక్కడు విడిగా వచ్చి, సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ అనే కొత్త సంస్థను స్థాపించాడు. సుబ్రహ్మణ్యం స్మారక చిహ్నం నిర్మాణ బాధ్యత తన బాధ్యతగా స్వీకరించి, నిధుల సమీకరణ మొదలు పెట్టారు. అయితే, సుబ్రహ్మణ్యం సంపాదన 200కోట్లకు మించి వుందని బయటపడడంతో ఆ స్మారక చిహ్న నిర్మాణానికి విరాళాలు ఇవ్వడానికి దాతలు పెద్దగా ముందుకు రావడం లేదు. పైపెచ్చు, అందు కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, కేటాయింపు చేసుకొన్న ఒకటిన్నర ఎకరా స్థలం కూడా కోర్టు వివాదంలో చిక్కుకొన్నది. సాధారణంగా ప్రాభవంలో వుండే రాజకీయవాదులు హఠాత్తుగా మరణించినప్పుడు వారి సంపాదన అన్యాక్రాంతమైందన్న వార్తలు వినవస్తుంటాయి. ఒక ఐఎఎస్ అధికారి కూడా అదే స్థాయిలో ఆర్జనచేయడం, అది పరులపరం కావడం, మన రాష్ట్రంలో అధికార యంత్రాంగం ఎంతగా పతనమైపోయిందో అర్థమయ్యేట్లు చేస్తున్నది.

# ఖజానా కట కట

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కడు దయనీయంగా తయారయ్యింది. ఖజానా ఒట్టిపోయింది. జీతభత్యాలకు కూడా అప్పులు తెచ్చి, సర్దుబాటు చేయవలసిన దుర్గతి ఏర్పడుతున్నది. ఈనెల జీతాలు అతి కష్టం మీద ఇచ్చారు. జీతాలు తప్ప భత్యాలు కూడా ఇవ్వలేక వాయిదావేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు మూడు నాలుగు తేదీలకు కానీ ఇవ్వలేరని చెప్తున్నారు. బొక్కసం అంతగా అడుగంటిపోయింది.

ఇది ఒక్కరోజులో జరిగిన అనర్థం కాదు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ నిధుల వ్యయంలో ఒకపద్ధతి, పాడు లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం, వ్యక్తిగత లాభాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసినందువల్ల ఏర్పడిన దుర్గతి ఇది. డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మహా మొండిమనిషి. ప్రజలను ఆకట్టుకోవడానికి ఏ పథకం మనసులోకి వచ్చినా వెనుకా ముందు చూడకుండా అమలు చేశాడు. సబ్సిడీ బియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీ రుణాలు, రైతుల రుణమాఫీ, మాఫీ వర్తించని వారికి ఐదు వేల లెక్కన పారితోషికం... ఇట్లా చెప్పుకొంటూపోతే వైఎస్ అమలు చేసిన పథకాల జాబితా కొండవీటి చాంతాడంత పొడుగు అవుతుంది. మరొకప్రక్క తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం జలయజ్ఞం కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో వేల కోట్ల రూపాయలు దోచి పెట్టాడు. పారిశ్రామికవేత్తలకు పన్నుల రాయితీ రూపంలో అంతేమొత్తంలో ప్రభుత్వ రాబడికి గండి కొట్టాడు. సాహసోపేతమైన ప్రజాకర్షక పథకాలు ఒక పక్క తను, తన అంతేవాసులు అపర కుబేరులుగా ఎదగడానికి మరొకప్రక్క ప్రభుత్వ ఖజానాతో ఆట్లాడాడాయన. ఆయన అదృష్టం కొద్దీ గత ఐదేళ్లు ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవృద్ధి శరవేగంతో పరుగులెత్తడంతో ఎంత దుబారా చేసినా లోటు కన్పించకుండా ప్రభుత్వ రాబడి ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడింది. కానీ ఆర్థికమాంద్యం పైన పడడంతో ఒక్కసారిగా ప్రభుత్వ రాబడి చిక్కిపోయింది. పన్నుల వసూళ్లు మందగించాయి. రాష్ట్రం మొత్తం కరవు కోరల్లో చిక్కిపోయింది. అసలే ఆర్థిక మాంద్యంతో సతమతమౌతున్న ప్రభుత్వానికి, ఈ కరవు పరిస్థితి మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు పరిణమిస్తున్నది. రానున్న ఒకటి రెండేళ్లపాటు ఆర్థిక పరిస్థితి మెరుగుపడే సూచనలు కన్పించడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కూడా క్షీణిస్తున్నాయి. మద్యం అమ్మకాలొక్కటే ఇప్పుడు ప్రభుత్వానికి నికరమైన ఆదాయమార్గం కావడం గమనార్హం.

రాజశేఖర్‌రెడ్డి బ్రతికి వుంటే ఈ సవాలును ఎట్లా ఎదుర్కొనేవాడో వూహించలేము. రెండవసారి ముఖ్యమంత్రి ఆయిననాటి నుంచి ఆయన వేగం తగ్గడం అందరూ గమనించేవుంటారు. ఇప్పుడు ఆయన లేడు. కానీ ఆయన ప్రారంభించిన పథకాలు మాత్రం అట్లానే వున్నాయి. వాటిని కొనసాగించవలసిన కర్తవ్యం కొత్త ముఖ్యమంత్రి రోశయ్య మీద పడింది. అది చిన్న చితకా బాధ్యత కాదు. వైఎస్ ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్ని వెనక్కు నెట్టినా ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి వస్తుంది. వాటన్నిటినీ అమలు చేయాలంటే ఆర్థికపరిస్థితి అనుకూలించడం లేదు. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అనే తీరులో సంకటం ఎదుర్కొంటున్నారాయన. అయితే వైఎస్ సాహసోపేత నిర్ణయాలన్నిటికీ ఆ ఐదేళ్లపాటు ఆర్థిక మంత్రిగా అమలు బాధ్యత నిర్వర్తించినవాడు కాబట్టి, ఈ కష్టాలను ఆయనకంటే సమర్థవంతంగా ఎదుర్కోగలిగినవాడు వేరొకరు లేరని చెప్పక తప్పదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీద రోశయ్యకు వున్న అవగాహన వేరెవరికీ లేదని అంగీకరించక తప్పదు.

ఆ అవగాహన, అనుభవాలను రంగరించి పరిపాలన చేయాలి రోశయ్య ఇప్పుడు. ప్రజలు కూడా పరిస్థితి అర్థం చేసుకొని వైఎస్ పథకాల అమలులో కొంత వెనుకబాటు తప్పకపోయినా అర్థం చేసుకొని సహకరిస్తేనే ఆయన ఈ గడ్డు పరిస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించగలుగుతాడు.

## జనవాణి

### అయోమయం

డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు ఆయోమయంలో పడ్డాయి. కొందరు పదవుల కొనసాగింపు కోసం మరికొందరు తాము సంపాదించిన అక్రమ ఆస్తులను కాపాడుకోవడం కోసం వైఎస్.జగన్‌ను ముఖ్యమంత్రి చేయమని వావాయాగి చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో వివిధ రంగాల్లో అభివృద్ధితోపాటు అవినీతి లెక్కలేనంతగా జరిగింది. ఈ విషయాన్ని ఇప్పటికి తెలుసుకొన్న కాంగ్రెస్ అధిష్టానం సీనియర్ రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. వైఎస్.జగన్‌ను ఇప్పటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిని చేస్తే ఆయన రాజకీయ ఎదుగుదలకు మంచిది కాదని నిజమైన శ్రేయోభిలాషులు గమనించే వుంటారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న అయోమయ రాజకీయవాతావరణాన్ని రూపుమాపను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గట్టిచర్యలే తీసుకోవాలి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

### భూగర్భ డ్రైనేజిని సక్రమంగా చేపట్టండి!

1967 ప్రాంతంలో దివంగత ఎసి సుబ్బారెడ్డి చొరవతో అప్పటి మునిసిపల్ ఛైర్మన్ ఆనం వెంకటరెడ్డి గారు నెల్లూరు పట్టణంలో భూగర్భ డ్రైనేజి పథకాన్ని చేపట్టారు. దురదృష్టవశాత్తు మొదటి దశ పూర్తికాకుండానే ఆ పథకం ఆగిపోయింది. పలువురు ముఖ్యమంత్రులు అధికారంలోకి వచ్చినా భారీ వ్యయంతో కూడుకొన్న ఈ పథకానికి సహకరించలేదు. డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రచ్చబండ కార్యక్రమానికి నెల్లూరు వస్తూ ఈ పథకానికి 750 కోట్లు మంజూరుచేస్తూ ఫైల్‌పై సంతకం పెట్టారు. ఈసారైనా ఈ పథకాన్ని లోటుపాట్లు లేకుండా పూర్తిచేస్తే స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూర్చినవారవుతారు.

సిహెచ్.హనుమంతరావు, నెల్లూరు

### ధరల నియంత్రణలో విఫలం

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకి పెరుగుతాన్నాయే తప్ప తగ్గడం లేదు. మార్కెట్లో వస్తువులు సమృద్ధిగా లభిస్తున్నా ధరలెందుకు పెరుగుతున్నాయో అర్థంకావడం లేదు. అక్రమ నిల్వలు, అక్రమ రవాణా, వినియోగవస్తు విక్రయంలో భారీస్థాయిలో ప్రైవేటు పెట్టుబడులు, ఫ్యూచర్ ట్రేడింగ్

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

6-10-1939
పేజీలు : 18 వెల: అణా

### జిల్లా బోర్డు ఎలక్షన్ - కాంగ్రెస్ దిగ్విజయం

14స్థానాలు పోటీలేకుండా కాంగ్రెసుకు వచ్చినవి. వచ్చిన స్థానాలన్నీ కాంగ్రెస్‌వే. ఒక్కరు కూడా ఇతర అభ్యర్థి రాలేదు. ఇకపోటీ 9సర్కిళ్లు, 11 సభ్యులు, 52 స్థానాలు కాంగ్రెసే జయించు సూచనలు.

### నెల్లూరు మునిసిపల్ చిత్ర విచిత్రాలు

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి కట్టిస్తామని డ్రెయినేజి పన్ను ప్రత్యేకంగా వసూలు చేస్తూ వేలకువేలు ఖర్చు పెట్టి డ్రెయినుల రిపేర్లకని ఎస్టిమేట్లు ప్యాసు చేసి కొత్త డ్రెయినులను కట్టించడం చూస్తే డ్రెయినేజి స్కీము పిల్లెత్తుక పోయిందా అని అనిపిస్తున్నది. కొత్త డ్రెయినుల సూపరింటెండింగు ఇంజనీరుగారి ఉత్తర్వులేనిదే కట్టడానికి అధికారం లేనందున, ఈ విధంగా ఇంద్రజాలం చేస్తున్నారు కౌన్సిలువారు. ఇది అక్రమం, అశాస్త్రీయం, పాత పోస్టాఫీసువీధి నుంచి చాకలివీధికి పోయ్యేసందులో డ్రెయినేజి లేనపుడు డ్రెయిను రిపేరుకని 160 రూపాయలు ఎస్టిమేటు ప్యాసయింది. కావాలంటే పోయి చూడొచ్చు.

-రంధ్రాన్వేషి

### గుండవోలులో తాంత్రిక చక్రవర్తి

2తేది తాంత్రిక చక్రవర్తి మా గ్రామానికి వచ్చాడు. అరగంట సేపున్నా ఒకరు గూడా రాలేదు. చివరకు మా పిచ్చిరెడ్డిగారి ప్రయత్నంతో తండోపతండాలు సమావేశమైరి.

### ఆ వచ్చిన ప్రేక్షకుల వివరం-

1.రెడ్డిగారి సేద్యగాడు రోశయ్య 2 రెడ్డిగారి వెట్టి పెంచలయ్య 3మాదిగ వెంకటయ్య 4ఒక మర్రిచెట్టు 5 రెండుగంగిరేణుచెట్లు 6 మిరియాలవారి గోడ 7 రామమందిరం తాలూకు రెండు కిటికీలు, తలుపులు - చక్రవర్తి గారు గంభీరోపన్యాసం సాగించేటప్పటికి చెట్లు తలలాడించినవి. గుడిలో దేముడు అవాచ్యాలు వినలేక, గాలిదేముడితో చెప్పి తలుపులు మూయించినాడు.

-సోరుడు

## 50 ఏళ్ల క్రితం ఈవారం

2-10-1959
పేజీలు: 12 వెల: 0-3-0

### మునిసిపల్ ఎన్నికల ఫలితాలు

నెల్లూరు ప్రతిపక్షానికి ఆశించకుండా పదిస్థానాలొస్తే, గూడూరులో కంకి కొడవలి గుర్తుతో పోటీజేసి కనీసం సగం సీట్లన్నా పొందగలమనుకున్న కమ్యూనిస్టులకు ఒక్క స్థానం మాత్రమే దక్కినది. నెల్లూరు అధికారపక్షమైన ఎసి సుబ్బారెడ్డి వర్గానికి 22 స్థానాలొచ్చినవి. గూడూరులో పొన్నలూరు కోటారెడ్డి వర్గానికి, ఒకరిమీద ఆధారపడకుండా, ఛైర్మన్ అయ్యే మెజారిటీ -10 స్థానాలు వచ్చినవి. పెల్లేటి వెంకటకృష్ణారెడ్డిగారు బలపరచిన అభ్యర్థులు ముగ్గురు; కమ్యూనిస్టు అభ్యర్థి ఒకరు; స్వతంత్రులు ముగ్గురు; ఎన్నికైనారు. అంటే ప్రతిపక్షంగా చెప్పుకోదగినవారు ఆరుమంది ఎన్నికైనారన్నమాట! గూడూరు ఎన్నికలో విశేషం - జిల్లా కమ్యూనిస్టు పార్టీ ప్రధాననాయకుడైన సి.సి.సుబ్బయ్య పరాజయం పొందడం.

### పంచాయితీ ఎన్నికలు

ఆత్మకూరు పంచాయితీ అధ్యక్షులుగా గుండాల వెంకటరమణారెడ్డి; బుచ్చి అధ్యక్షులుగా మేనకూరు గోపాలకృష్ణారెడ్డి; అల్లూరు అధ్యక్షులుగా చిట్టమూరు సుబ్బరామిరెడ్డి గారలు ఎన్నుకోబడ్డారు. అల్లూరు ఎన్నిక గత 2తేది; ఆత్మకూరు, బుచ్చి ఎన్నికలు గత 14తేది జరిగినవి.

-ఓ.వి

### పంచాయితీ అధ్యక్షతను వేలం వేసిన గ్రామం

ఆత్మకూరు తాలుకా, విరువూరు పంచాయితీ ఎన్నికలో పోటీ నివారించుటకు ఒక క్రొత్త మార్గం అనుసరింపబడింది. గ్రామంలో పార్టీలున్నవి. ఎన్నికలలో పోటీలు తప్పవు. అందువల్ల అన్ని వర్గాలవారు కలుసుకొని ఒక అంగీకారానికి వచ్చారు. పంచాయితీ అధ్యక్షతను వేలం పెట్టవలసినట్లు అందులో ఎవరు ఎక్కువ మొత్తం పాటపెడితే, ఆ వర్గానికి పోటీ లేకుండా పంచాయితీ వదలివేయవలసినట్లు, ఆ డబ్బును హాస్పిటల్ భవననిర్మాణానికి వినియోగించునట్లు నిర్ణయించుకొన్నారు. కొల్లి పిచ్చిరెడ్డి ఆరువేలకు పాట పాడారు. డబ్బు బ్యాంకులో కట్టారు. సభ్యులు, అధ్యక్షుడు పోటీ లేకుండా ఎన్నుకోబడ్డారు. కొల్లి పిచ్చిరెడ్డి అధ్యక్షులయ్యారు.

# నెల్లూరు ముచ్చట్లు
## విశేషాలు



నెల్లూరు అయ్యప్పగుడి వద్ద చెవర్లెట్ కార్ల షోరూంను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ప్రక్కన మేయర్ భానుశ్రీ, ఎమ్పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధరకృష్ణారెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, షోరూం అధినేతలు రాజ్‌కుమార్, దిలీప్‌చక్రవర్తి.

### చంద్రమోహన్‌రెడ్డికే దేశం పగ్గాలు!

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా మళ్లీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ పొలిట్ బ్యూరోలో స్థానాన్ని చంద్రమోహన్‌రెడ్డి ఆశిస్తే జిల్లాలో తెలుగుదేశం రాజకీయాలు ఆయన లేకుండా నడవవని చంద్రబాబు తలచి మళ్లీ ఈ బాధ్యతలు అప్పజెప్పారు. 1992 - 94, 2004 - 2009 సంవత్సరాల్లోనూ పార్టీ అధ్యక్షునిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పని చేశారు.

పార్టీ ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గంలో నలుగురు నెల్లూరీయులకు చోటు దక్కింది. మాజీ ఎమ్పీ డాక్టర్ ఉక్కాల రాజేశ్వరమ్మ, వేనాటి చంద్రారెడ్డిలు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులుగా, నువ్వుల మంజుల, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి పార్టీ కార్యదర్శులుగా నియమితులయ్యారు.

తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షునిగా బీద రవిచంద్రను కొనసాగించనున్నారు.

### ఎండా - వాన!

జిల్లాలో చిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొని వున్నాయి. పగటి పూట 37 సెంటిగ్రేడ్ డిగ్రీల ఎండ కాస్తుంటే, సాయంత్రం, రాత్రివేళల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. నవంబర్ నెలలో వాయుగుండాలు ఏర్పడితేగానీ జిల్లాలో విస్తారంగా వర్షం కురిసేట్లు లేదు.

### సోమశిలలో నీళ్లు

సోమశిల ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన కడప జిల్లాలో వర్షాలు పడుతుండడంతో పై నుంచి నీరు వచ్చి చేరుతున్నది. 30వ తేది నాటికి సోమశిలలో 22 టిఎంసిల నీళ్లు నిలువ వున్నాయి. పెన్నా డెల్టాకు 50 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 45 క్యూసెక్కుల నీళ్లు ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు.

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు,
ఫోన్: 2331133, 2327611

### ఆల్‌టైం రికార్డు ధరకు నిమ్మకాయలు!

ఈ యేడాది సెప్టెంబర్ నెలలో నిమ్మకాయలు ఆల్‌టైమ్ రికార్డు ధర పలికాయి. రంజాన్, దసరా పండుగలు వారం విడిచి వారం రావడంతో బస్తా ధర ఎనిమిది వేల రూపాయల వరకు వెళ్లింది. దసరా పండుగ ముందు రోజు ఒక్క నిమ్మకాయ ఐదు రూపాయలు పలికింది. గత ఏడాది ఓ గుమ్మడికాయ 250 రూపాయలు పలకడంతో ఈ సారి ఎక్కువ మంది రైతులు ఈ పంట పండించారు. కానీ 50 రూపాయలకు మించి ధర పలకకపోవడంతో దసరా పండుగ ఘడియలు దాటాక వాటిని రోడ్డు ప్రక్కన వదలివేసి వెళ్లారు.

### దుస్థితిలో మార్కెట్లు!

నెల్లూరు నగరాన్ని సుందర నందనవనంగా చేస్తామని నేతలు ప్రగల్భాలు పలకడమేగానీ ముఖ్యమైన ప్రదేశాలను అభివృద్ధి చేయడంలో విఫలమవుతున్నారు. ప్రతినిత్యం వేలాది మంది జనం కూరగాయల కోసం వెళ్లే ఎసి కూరగాయల మార్కెట్‌లో నాలుగు చినుకులు పడితేచాలు అడుగుతీసి అడుగు వేయలేనంతగా అశుభ్రత, చెత్తాచెదారం పేరుకపోయి వుంటుంది. కానీ ఈ పరిస్థితుల్లోనే జనం కూరగాయలు కొనాల్సి వస్తుంది. డైకస్‌రోడ్డులోని చేపలు, మాంసం మార్కెట్ గబ్బుకొడుతుంది. ఈ ప్రాంతంలో ఆధునిక మార్కెట్ నిర్మాణానికి మహాఘనత వహించిన నేతలకు ఇంకా ఎన్ని దశాబ్దాలు పడుతుందో? పురపాలక శాఖ మంత్రి రామనారాయణరెడ్డి ఇంటికి కూతవేటు దూరంలో వుండే సంతపేట మార్కెట్ కూడా దుస్థితిలో వుంది. మార్కెట్లను శుభ్రంగా వుంచితే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఈ విషయాన్ని నేతలు, అధికారులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

### మోసపోయిన నాయుడుపేట వాసులు

నాయుడుపేట వాసులను సుప్రభాత్ చిట్స్ సంస్థ నిలువునా మోసం చేసింది. 20 ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం నిర్వహిస్తున్న ఈ సంస్థ ఒక్క నాయుడుపేట వాసులకే తొమ్మిది కోట్ల రూపాయల మేర శఠగోపం పెట్టింది. నెలకు వంద రూపాయలకు రెండు రూపాయలు వడ్డీగా ఇవ్వడంతో పలువురు లక్షల రూపాయల్లో డిపాజిట్లు చేశారు. చెన్నై, గూడూరు, శ్రీకాళహస్తిలలో కూడా సుప్రభాత్ చిట్స్‌ను నిర్వహించిన కుప్పుస్వామి బాబు పరారైపోయాడు. ఇతనిది చెన్నై అని, చిత్తూరు జిల్లా అని భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ సినిమాహాల్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435616, 9849495615

### చెంగాళమ్మకు రామనారాయణ పూజలు

రాష్ట్ర పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సతీసమేతంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మను 27వ తేది సేవించారు. అనంతరం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎం కావాలన్నది సర్వజనాభిప్రాయమన్నారు. తన వ్యక్తిగత అభిప్రాయం కూడా ఇదేనన్నారు. ఈ విషయాన్ని ఎవరూ తప్పుపట్టాల్సిన అవసరం లేదన్నారు. రోశయ్య సమర్థుడు కాబట్టే అధిష్టానం ఆయనకు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పజెప్పిందన్నారు.

### రాజేశ్వరమ్మ సేవలో జిల్లా అధికారులు

నెల్లూరు దర్గామిట్టలో వెలసిన రాజరాజేశ్వరమ్మను 27వ తేది సాయంత్రం జిల్లా కలెక్టర్ రాంగోపాల్, జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, ఎస్పీ మల్లారెడ్డిలు సతీసమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

### యుగంధర్ కుమార్ బదలీ

రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్ట్ డైరక్టర్‌గా పనిచేస్తుండిన యుగంధర్ కుమార్‌ను గుంటూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పి.డిగా బదలీ చేశారు. యుగంధర్ కుమార్ నెల్లూరు జిల్లా వాసి. 15 ఏళ్లుగా జిల్లాలోని వివిధ మండలాల్లో ఎమ్పీడిఓగా పనిచేశారు. ప్రమోషన్‌పై ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా పనిచేసిన ఆయన 2007లో రాజీవ్ విద్యామిషన్‌లోకి వచ్చారు. ఇక్కడే యుగంధర్ కుమార్ పలు పథకాలు విజయవంతంగా చేపట్టి మంచి పేరు తెచ్చుకొన్నారు.

### కలెక్టరేట్‌లో షార్ట్ సర్క్యూట్!

కలెక్టరేట్‌లోని అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో హై ఓల్టేజి రావడం వల్ల వైర్లు మాడిపోయాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో సిబ్బంది కార్యాలయంలో వుండడంతో ఫైళ్లు కాలడం వంటి అవాంఛనీయ ఘటనలు తప్పాయి. ఈ మధ్యే కొత్తగా చేయించిన వైరింగ్‌లో జరిగిన లోటుపాట్లను కలెక్టర్ పరిశీలిస్తే వాస్తవాలు బయటపడుతాయి.

### సాయిబాబాకు బంగారు కిరీటం

నెల్లూరు బాలాజీనగర్‌లోని సాయిదర్బార్‌లో వెలసిన సాయిబాబాకు విజయదశమి రోజు బంగారు తాపడం చేసిన కిరీటాన్ని ధరింపజేశారు. ఈ కిరీటాన్ని నెల్లూరు రేబాలవారి వీధికి చెందిన విడవలూరు రాధమ్మ బహుకరించగా కోలారులోని అలిగిరి శ్రీనివాసాశ్రమ పీఠాధిపతి విశ్వేయానందస్వామి బాబాకు అలంకరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బాబా భక్తులు విచ్చేశారు.

### తీర ప్రాంతంలో అలజడి

వాతావరణంలో మార్పుల కారణంగా 26వ తేది జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో అలజడి రేగింది. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, అల్లూరు, కావలి మండలాల్లో పెనుగాలులు వీయడంతో సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల పడవలు తిరగబడి దెబ్బతిన్నాయి. వలలు తెగిపోయాయి. మగవాళ్లు ప్రాణాలతో తిరిగి వచ్చినందుకు మత్స్యకార మహిళలు గంగమ్మకు పూజలు చేసి హారతులు పట్టారు.

### 9నెలల తర్వాత ఉత్తరాల బట్వాడా

జిల్లాలోని పోస్టల్ శాఖ పనితీరుకు సంగం పోస్టాఫీసు అద్దం పట్టింది. ఇక్కడ పోస్ట్‌మెన్‌గా పనిచేసే జాకీర్ గత తొమ్మిది నెలలుగా తపాలు బట్వాడా చేయలేదు. విచారణకు వెళ్లిన అధికారి పేరుకపోయిన ఉత్తరాలు, రిజిష్టర్ పోస్టులోని ఉత్తరాలు, హాల్ టిక్కెట్లు, ఇంటర్వ్యూల కార్డులు చూసి అవాక్కయ్యారు. జాకీర్‌ను సస్పెండ్‌చేసి ఆత్మకూరు పోస్ట్‌మెన్‌ను సంగంలో నియమించారు.

### ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు మరుపూరు అవార్డు

సాహితీవేత్త, కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామిరెడ్డి స్మారకంగా ప్రవేశపెట్టిన అవార్డును తొలిసారిగా అందుకునే భాగ్యం ప్రఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు దక్కింది. అక్టోబరు 3వ తేది టౌన్‌హాలులో ఏర్పాటుచేసే సభలో ఈ అవార్డును బాలసుబ్రహ్మణ్యంకు బహుకరిస్తామని కార్యక్రమ నిర్వాహకకమిటీ కార్యదర్శి శైలజ చెప్పారు.

### మంచు శివలింగం

శరన్నవరాత్రులను పురస్కరించుకొని నెల్లూరు రాజరాజేశ్వరి దేవస్థానంలో ప్రజాహిత బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకులు ఏర్పాటుచేసిన మంచు శివలింగాన్ని చూడను భక్తులు బారులు తీరారు.

### లాఠీఛార్జిపై వివరణ కోరిన హక్కుల కమిషన్

విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యా

కొరవ 14వ పేజీలో

దసరా ధమాకా

### మామూళ్ల పంట పండించిన

# ఎక్సైజ్, రవాణాశాఖలు!



దసరా పండుగ ఎక్సైజ్, రవాణాశాఖాధికారులకు కాసుల పంట పండించింది. కేవలం ఈ రెండు శాఖలే కలసి కోటి రూపాయల మేర దసరా మామూళ్లు వసూలు చేశాయి. ఈ మొత్తాన్ని ఈ రెండు శాఖల్లో వుద్యోగులు క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు వారి వారి హోదాలను బట్టి పంచుకొన్నట్లు తెలిసింది. దసరా మామూళ్ల వసూళ్ల కోసం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బహిరంగంగా వేలం పాట నిర్వహించారు. ఈ పాట 50లక్ష లకు తెగినట్లు తెలిసింది. పాట పాడుకొన్న ఉద్యోగులు బ్రాందీ షాపులకు రెండు వేలు, బారుకు ఐదువేలు, బెల్ట్ షాపుకు 500 రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేశారంటే అవినీతిలో వీరెంత పండిపోయారో అర్థం చేసుకోవచ్చు.



రవాణాశాఖాధికారులు కూడా నలుగురు సిబ్బందిని కేవలం దసరా మామూళ్ల వసూలు కోసం నియమించారు. వీరు సిటీబస్సులు, జాక్ పాట్ లారీలు, ఐరన్ ఓర్ లారీల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసుకొని దసరా సెలవులకు ముందురోజు వుద్యోగులందరికీ వారి వారి హోదాలను బట్టి కవర్లలో పెట్టి ఇచ్చారట. ఎక్సైజ్ శాఖకు నెలమామూళ్ల తోపాటు దసరా మామూళ్ల కూడా ఇవ్వాల్సి రావడంతో బ్రాందీ షాపులు, బార్లు, బెల్ట్‌షాపు నిర్వాహకులు తిట్టిపోస్తున్నా వీరిలో మార్పు రావడం లేదు.

# జర్నలిస్ట్ కాలనీలో పార్కు కబ్జా!

● కబోధులుగా కార్పొరేషన్ సిబ్బంది



నెల్లూరు కార్పొరేషన్ అయ్యాక స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో జానెడు ప్రభుత్వ స్థలం ఖాళీగా కనిపించినా చాలు రాత్రికి రాత్రి గుడిసెలు వేసేస్తున్నారు. నగరంలోని నీటిపారుదలశాఖకు చెందిన కాలువల ప్రక్కన స్థలాలతోపాటు దేవాదాయ, వక్ఫ్ బోర్డు స్థలాలు భూబకాసురుల చేతిలోకి వెళ్లిపోయాయి. మిగిలి వుండేది కార్పొరేషన్ పార్కులు. వీటిని సైతం ప్రజాప్రతినిధులు, వారి అండదండలుండే వారు దర్జాగా ఆక్రమించి అమ్మేస్తున్నారు. నగరంలోని నిప్పో ఫ్యాక్టరీ ప్రక్కన 1968 ప్రాంతంలో జర్నలిస్టు కాలనీ ఏర్పడింది. నేడు ఆ ప్రాంతంలో భూమి విలువ బాగా పెరిగిపోయింది. కాలనీ ఏర్పడినప్పుడు పార్కును ఏర్పాటు చేశారు. ఈ పార్కుకు చుట్టూ ప్రహరీగోడ అందమైన పూలమొక్కలు, పిల్లలు ఆటలాడుకొనే వస్తువులుండేవి. కాలక్రమేణా పార్కు పాడుపడింది. దీన్ని అదునుగా చేసుకొని కొందరు పార్కులో పశువులు కట్టుకోనారంభించారు. ఆ తర్వాత గడ్డివామివేశారు. ఈ విషయాన్ని బాగా గమనించిన బడా కాంట్రాక్టర్ ఒకరు ఈ పార్కును ఆక్రమించి అందులో ఇల్లు కట్టుకొనే ఏర్పాట్లు చేస్తున్నాడు. తాజాగా పార్కు స్థలంలో ఇటుకలు సైతం తోలాడు. ఈయనకు ప్రజాప్రతినిధుల మద్దతు వుండడంతో ఇక కట్టడమే తరువాయి. పార్కు స్థలం దురాక్రమణను కార్పొరేషన్ అధికారులు అడ్డుకోవాల్సిన అవసరం లేదా?

## డిఇఓ విశాల హృదయం

నెల్లూరు డిఇఓ ఆంజనేయులు తనను కొట్టినవారిని కూడా క్షమించి తనది విశాల హృదయమని చాటిచెప్పారు. గత నెలలో సిఎమ్ స్కూల్‌లో జరిగిన టీచర్ల బదలీల కౌన్సిలింగ్ సందర్భంగా ఉపాధ్యాయుడు కృష్ణ రాజేంద్ర తన భార్య బదలీ విషయంలో అన్యాయం జరిగిందన్న ఆవేశంతో టేబుల్‌పైవున్న వాటర్ బాటిల్‌ను డిఇఓపై విసిరికొట్టాడు. ఆ తర్వాత ఈ ఉపాధ్యాయుడ్ని సస్పెండ్ చేయడం జరిగింది. ఉపాధ్యాయ సంఘాలు ఈ ఉపాధ్యాయుని తప్పును మన్నించమని కోరడంతో ఆయన మెత్తబడి సస్పెన్షన్‌ను ఉపసంహరించారు. క్రమశిక్షణా రాహిత్యాన్ని విద్యాశాఖలోనూ ప్రోత్సహించడం మంచిదంటారా?

## బిల్లుల చెల్లింపులు నిలిపివేత

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హఠాన్మరణంతో సిఎం పీఠంపై రోశయ్య కూర్చోవడంతో ఖజానాను గాడిలో పెట్టే పనులు వేగవంతమయ్యాయి. ఆర్థిక మాంద్యానికితోడు ఖజానా నిండుకోవడంతో పొదుపు చర్యలు చేపట్టడంతోపాటు పలు రకాల బిల్లులను నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఎక్కడికక్కడ బిల్లుల చెల్లింపులు నిలచిపోయాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లు ఈ పరిణామంతో హతాశులయ్యారు. ఇరిగేషన్, సివిల్ వర్క్ చేసిన కాంట్రాక్టర్ల బిల్లులను నిలిపివేయడంతో చిన్న చిన్న కాంట్రాక్టర్లు, పెద్ద కాంట్రాక్టర్ల వద్ద నుంచి సబ్‌వర్క్ చేసినవాళ్లకు చిక్కులొచ్చిపడ్డాయి. వీరంతా రోశయ్యను తెగతిట్టుకొంటున్నారట.

# దారి తప్పిన ఇంటర్నెట్ సెంటర్లు!




నెల్లూరులో ఇంటర్నెట్ కేంద్రాలను వీటి నిర్వాహకులు ఇష్టమొచ్చిన రీతిలో నడుపుతున్నారు. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ కేంద్రాలకు అనుకున్న ఆదాయం రాకపోవడంతో వీటిలో అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించి నాలుగురూకలు వెనుకేసుకొంటున్నారు. ఇంటర్నెట్ కేంద్రాల్లో నీలిచిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ప్రేమజంటల కోసం ప్రత్యేక క్యాబిన్లు నిర్వహిస్తూ ప్రత్యేకఛార్జీ వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఇంటర్నెట్ కేంద్రానికి వెళ్లే వ్యక్తి గుర్తింపు కార్డుల్లో భాగమైన ఓటరు కార్డు, ఏదైనా డ్రైవింగ్ లైసెన్స్,

**నిబంధనలకు పాతర**

కాలేజి ఐడెంటిటి కార్డు చూపిస్తేనే ఇంటర్నెట్ కేంద్రంలోకి అనుమతించాలి. నెట్ నిర్వాహకులు తప్పనిసరిగా రిజిష్టర్ నిర్వహించాలి. నెట్‌కు వచ్చిన వారి పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్‌తోపాటు ఎన్ని గంటలు ఈ కేంద్రంలో వుండింది నమోదు చేయాలి. ప్రత్యేక క్యాబిన్ల నిర్మాణానికి అనుమతి లేదు. అయితే వీటిని నిర్వాహకులు పట్టించుకోవడమే లేదు. నగరంలోని వందకుపైగా ఇంటర్నెట్ సెంటర్లలో సగానికిపైగా దారి తప్పినడుస్తున్నాయి. పక్కా సమాచారం వస్తే తప్ప వీటిపైపు పోలీసులు కూడా కన్నెత్తి చూడకపోవడంతో ఇవి దారి తప్పిపోయాయి.

## నెల్లూరు ఆర్టీసికి అవార్డులు!

నెల్లూరు ఆర్టీసి రీజియన్‌లో రాబడి పెంచేందుకు కృషి చేసిన డిపో-1, డిపో-2 మేనేజర్లు ఈగా భాస్కర్‌రెడ్డి, పి.శీనయ్యలకు ఆర్‌ఎం శేషగిరిరావు ప్రత్యేక అవార్డులందించారు. కోటీ 40లక్షల రూపాయల ఆదాయం తెచ్చి నెల్లూరు రీజియన్ రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. గ్రామగ్రామానికి ఆర్టీసి సేవలు విస్తృతపర్చడంతోపాటు, సంస్థ పెట్టిన రూట్, క్యాట్ కార్డులు, పెరిగిన బస్సులు, సిబ్బంది కృషితో నెల్లూరు ఆర్టీసి లాభాలబాట నడిచిందంటున్నారు ఆర్‌ఎం. లాభాలేగాకుండా ఆర్టీసి బస్సులు, స్టాండుల్లో ప్రాథమిక సౌకర్యాల మెరుగుపై కూడా దృష్టి పెట్టండి ఆర్‌ఎం గారూ!



# బార్లుగా మారిన డాబాలు

● పట్టించుకోని సివిల్, ఎక్సైజ్ పోలీసులు

నెల్లూరు నగర శివారు ప్రాంతంలో పుట్టగొడుగుల్లా డాబాలు వెలుస్తున్నాయి. ఈ డాబాలను వీటి నిర్వాహకులు బార్లుగా మార్చి మద్యం అమ్మకాలు జరిపిస్తున్నా ఇటు ఎక్సైజ్ పోలీసులుగానీ అటు సివిల్ పోలీసులుగానీ తమకేమీ పట్టనట్లున్నారు. శివారు ప్రాంతాలైన బుజబుజనెల్లూరు, ఎన్టీఆర్‌నగర్, కొత్తూరు, గొలగమూడి రోడ్డు, కోవూరు బైపాసుల్లోని 15 డాబాలను బార్లుగా మార్చేశారు. ఈ డాబాల్లో బ్రాందీ, విస్కీ బీర్లు అధికధరలకు అమ్ముతున్నారు. డాబాలలో మద్యం సేవించేందుకు కుర్చీలు, బల్లలతోపాటు మందుబాబులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తుండడంతో డాబాలను వెతుక్కొంటూ పోతున్నారు. డాబాలలో మద్యం సేవించి స్కూటర్లపై బయలుదేరినవాళ్లు యాక్సిడెంట్లు చేస్తున్నారు. ఈ యేడాది డాబాల దగ్గర నుంచి వస్తూ ఆరు మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. డాబాలపై ఎక్సైజ్, సివిల్ పోలీసులు ప్రత్యేక ప్రేమ చూపించడం వెనుక నెలసరి మామూళ్లే కారణమని చెప్పక తప్పదు.

# ఆహార కొరత తప్పేట్లు లేదు!

**దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటడం, భవిష్యత్తులో ఆహార కొరతను సూచిస్తున్నాయని నెల్లూరులో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, మేధావులు అభిప్రాయపడ్డారు.**



నెల్లూరులో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలలో మాట్లాడుతున్న త్రిపుర డిప్యూటీ స్పీకర్ భానులాల్‌సాహ.

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ఆహార ధాన్యాల కొరత తీవ్రంగా వుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహారధాన్యాల ఉత్పత్తులు పెంపొందించడంలోనూ, నిల్వ చేయడంలోనూ పూర్తిగా విఫలం చెందుతున్నాయి. ఆహారభద్రత కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు, ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు తప్పడం లేదు. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడంతో విదేశాలపై పూర్తిగా ఆధారపడే పరిస్థితులు ఏర్పడ్డాయని మేధావులు, వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడం, మరో ప్రక్క నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో దేశం మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూంది.

దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలో పడిపోవడానికి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలే కారణమని మేధావులు చెబుతున్నారు. సామ్రాజ్యవాదుల వత్తిడులకు తలొగ్గడం, బహుళ జాతి సంస్థలకు పెద్దపీట వేసి అనేక రాయితీలు కల్పిస్తుండడంతో ప్రభుత్వానికి రావలసిన కోట్ల రూపాయల పన్నులు రాకుండా పోతున్నాయి. మరోప్రక్క ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు రాబట్టుకోలేకపోవడం, బడా పారిశ్రామిక సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇవ్వడం వలన ప్రభుత్వం ఆర్థికసంక్షోభం ఎదుర్కోక తప్పడం లేదు. ఆహారధాన్యాలను పంపిణీ చేసే ప్రజాపంపిణీ వ్యవస్థ కూడా సక్రమంగా పని చేయకపోవడం వలన ప్రజలకు నిత్యావసర సరుకులు సరిగ్గా అందడం లేదు.

రాజకీయవత్తిళ్ల కారణంగా ఈ వ్యవస్థ ఆశించిన మేర లక్ష్యాలను సాధించలేకపోతుందన్న భావన వినిపిస్తుంది. ప్రస్తుతం పేద ప్రజలకు వర్తింప చేస్తున్న సబ్సిడీ బియ్యంలో కూడా కోత విధించే అవకాశాలు వున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఆహార భద్రత చట్టం ఏర్పాటు చేస్తే ఇటువంటి పరిస్థితుల నుంచి బయటపడవచ్చునన్నది వ్యవసాయ శాస్త్రవేత్తలు, మేధావుల అభిప్రాయం. గతవారం నెల్లూరు నగరంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న పలువురు వక్తలు కూడా వ్యవసాయరంగం, ఆహార ఉత్పత్తుల కొరతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది.

## పెద్దలకు రాయితీలెక్కువ!

దేశంలో భూ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సరైన విధానాలను అవలంభించడం లేదని వ్యవసాయరంగంపై నిర్వహించిన ప్రత్యేక సెమినార్ అభిప్రాయపడింది. పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ చేసేందుకు సంవత్సరానికి 70 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుండగా బహుళజాతి కంపెనీలకు రాయితీల పేరిట దాదాపు 3 లక్షల కోట్ల రూపాయలకు పైగా ఇస్తూ ఈ మేర ప్రభుత్వం ఆదాయం కోల్పోవాల్సి వస్తుంది. ఇందుకు ఉదాహరణగా రిలయన్స్ కంపెనీని చెప్పవచ్చు. ఈ కంపెనీ 45వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం రాయితీ పేరిట లబ్ధిపొందుతుంది. ఇటువంటి బహుళజాతి కంపెనీలకు రాయితీలు కల్పించడం వలన సన్న, చిన్నకారు రైతులు జీవించేందుకు ఆస్కారం లేకుండా పోతుంది. మన రాష్ట్రంలో అధికభాగం కౌలుకు సంబంధించిన రైతులు వున్నారు. కౌలుదార్లకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు వాటిని అమలు చేసేందుకు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరగలేదు.

ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో జీవించాలంటే ప్రతి కుటుంబానికి రెండెకరాల మాగాణి భూమి పంపిణీ చేయాలన్నది కార్మిక నాయకుల అభిప్రాయం. మరోప్రక్క సహకార సేద్యం పేరిట పేదల భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తున్నది. భూస్వాములు, ధనిక వర్గాల వద్ద వున్న వేలాది ఎకరాల మిగులు భూముల్ని స్వాధీనం చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నది. మిగులు భూములను స్వాధీనం చేసుకొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే వ్యవసాయ కార్మికులే వాటిని ఆక్రమించేందుకు సిద్ధపడాలని నేతలు పిలుపునిస్తున్నారు. ఆహారఉత్పత్తులు నిల్వ చేయడంలో మనదేశం బాగా వెనుకబడి వుందనివారు చెబుతున్నారు. సరైన పౌష్టికాహారం అందక వేలాది పేద ప్రజలు వ్యాధుల బారినపడి మరణిస్తున్నారన్నది నగ్నసత్యం.

రైతులు కేవలం వరిపంటపైనే ఆధారపడకుండా రాగులు, జొన్న, గోధుమ పంటలపై దృష్టి సారించే విధంగా వ్యవసాయశాఖ ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. రైతులకు పంటలపై పూర్తి అవగాహన కల్పించడంలో ఈ శాఖ విఫలం చెందింది. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారస్తుల నుంచి నాణ్యతలేని విత్తనాలు కొనుగోలు చేసి రెండు విధాలా నష్టపోతున్నారు. నగరంలోని కస్తూర్బాకళాక్షేత్రంలో మూడు రోజులపాటు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 25వ రాష్ట్ర మహాసభల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు, ప్రొఫెసర్లు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వ్యవసాయరంగం, ఆహార భద్రత, ఆహారధాన్యాల ఉత్పత్తులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై వారు వెల్లడించిన అభిప్రాయాలు దిగువ నిస్తున్నాం.



### భూముల్ని సాగులోకి తేవాలి!

ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసిన భూముల గురించి పట్టించుకోవడం లేదు. పంపిణీ చేసిన భూముల్ని సాగులోకి తీసుకొస్తే ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు వ్యవసాయ కార్మికుల జీవనోపాధి కూడా కొంత మేర మెరుగుపడే అవకాశం వుంటుంది. కేవలం భూ పంపిణీ చేసి చేతులు దులుపుకుంటే ఎటువంటి ప్రయోజనం వుండదు. భూముల్ని సాగులోకి తెచ్చేందుకు ఎక్కువ నిధులు కేటాయించాల్సిన అవసరం వుంది.

**బి.వి. రాఘవులు,** సిపిఎం రాష్ట్ర కార్యదర్శి



### రాయితీలు కల్పించకూడదు!

మన దేశంలోని కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలకు అనేక రాయితీలు కల్పిస్తున్నందున ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్నది. ఈ రాయితీలలో కోత విధిస్తే పేదప్రజలకు ఆహారధాన్యాలు మరింత చౌక ధరలకు సరఫరా చేసే అవకాశం వుంటుంది. సంపన్న వర్గాలకు రాయితీలు కల్పించి, పేద ప్రజలపైన అధిక భారం విధించే విధంగా కేంద్రంలోని యు.పి.ఏ ప్రభుత్వం వ్యవహరిస్తుంది.

**జయతి ఘోష్,** ప్రొఫెసర్



### ఆహార ఉత్పత్తులు పెంచాలి!

దేశంలోను, రాష్ట్రంలోను ఆహార ధాన్యాల ఉత్పత్తులు గణనీయంగా తగ్గాయి. ఇందుకు ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలే కారణంగా చెప్పొచ్చు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నందున ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆహారఉత్పత్తులు పెరిగితే దేశంలో కరువు పరిస్థితులను నివారించడంతోపాటు ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం వుండదు. ఇందుకు ముందుగా అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి.

**నరసింహారెడ్డి,** ప్రొఫెసర్



### భూ సమస్యను పరిష్కరించాలి!

మనదేశంలో ప్రధానంగా భూసమస్య వుంది. భూ సమస్యలు పరిష్కరింపబడకుంటే పేద ప్రజల జీవన విధానంలో మార్పు తీసుకురావడం సాధ్యంకాదు. 1978 సంవత్సరం నాటి అనుభవాలను దృష్టిలో వుంచుకుని పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో భూ సమస్యను పరిష్కరించి విజయం సాధించడం జరిగింది. భూపంపిణీకి శ్రీకారం చుట్టి ప్రతి ఒక్కరికి భూమిపై హక్కు వుండేవిధంగా కృషి చేశాం.

**భానులాల్‌సాహు,** డిప్యూటీ స్పీకర్, త్రిపుర

○ స్థలం ఎంపిక పూర్తికాలేదు

## ఆత్మకూరులో ఇందిరమ్మ నత్తనడక

ఆత్మకూరు పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రహసనంగా మారుతున్నది. రెండవ విడతలోనే ఆత్మకూరు గ్రామ పంచాయితీ ఇందిరమ్మ ఆదర్శ గ్రామమై రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు పేదలెవరూ ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నారు. పంచాయితీ పరిధిలో స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి స్థలం పొందినా ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి తలెత్తింది ఆత్మకూరు పట్టణంలో. దీనికి గతంలో తహశీల్దార్‌గా పనిచేసిన నారాయణమ్మ ప్రధాన కారణం. మొదట పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు పంటపొలాన్ని సేకరించబోయారు. ఇందుకోసం పత్రికల్లో భూసేకరణకు సంబంధించి ప్రకటనలు భారీగా ఇచ్చారు. ఆనాటి తహశీల్దార్ రాజకీయ కారణాలతో ద్వంద్వవైఖరి అవలంభించడంతో పేదల ఇంటి స్థలాలకు అధ్వాన్నమైన భూములను కేటాయించారు. ఫ్లోరిన్ ప్రభావం అధికంగా వున్న ప్రాంతంలో వీటిని ఇవ్వడంతో ఇళ్లు కట్టుకొనే పరిస్థితిలేక, గృహవసతికి నోచుకోక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం నెరవేరే పరిస్థితులు కన్పించడం లేదు. ప్రస్తుతం వున్న తహశీల్దార్ అయినా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టాల్సి వుంది.



నర్రవాడలో జరిగిన అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలచిన కృష్ణాజిల్లా జట్టుకు బహుమతినందిస్తున్న మాజీ మంత్రి మాదాల జానకిరాం.



దసరా పండుగ రోజు మంత్రి రామనారాయణరెడ్డి ఇంట్లో రాజీవ్ ఆవాస్ యోజన పథకంపై జరిగిన సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులు.

## నీటి సరఫరా అబందర

ఆత్మకూరు పరిస్థితిది!

ఆత్మకూరు పట్టణంలో త్రాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారుతోంది. ఒకవైపు మంచినీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుంటే మరోవైపు నీటి వృధా జరుగుతుండడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా వుంది. గత మూడేళ్లలో ఆత్మకూరు పంచాయితీ షుమారు 3కోట్ల రూపాయలు వెచ్చించి నూతన నీటి పథకాన్ని నిర్మించినా ఆశించిన ప్రయోజనమైతే చేకూరలేదు. స్పష్టమైన, ప్రణాళికబద్ధమైన చర్యలు లేకపోవడమే ఇలాంటి సమస్యలకు మూలకారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికితోడు అక్రమకొళాయి కనెక్షన్లు ఇబ్బడి ముబ్బడిగా ఇస్తున్నారు పంచాయితీ సిబ్బంది. ఆత్మకూరు పట్టణం త్వరలో పురపాలక సంఘంగా మారనుందనే ప్రచారంతో కొళాయి కనెక్షన్లకు డిమాండ్ ఏర్పడింది. 3వేల రూపాయలు కట్టాల్సిరావడంతో పంచాయితీ సిబ్బంది వెయ్యిరూపాయలు తీసుకొని కొళాయి కనెక్షన్లు అనధికారికంగా ఇచ్చేస్తున్నారు. మరోవైపు పంచాయితీ తరపున వివిధ కార్యక్రమాలకు తరలించే వాటర్‌ట్యాంకు నిర్వహణ వివాదాస్పదమవుతోంది. నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా రాజకీయ కారణాలతో తమకు ఇష్టం వచ్చిన వారికే ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తుండడంతో వివాదాస్పదమవుతోంది.

● మైకా కార్మికుల సంక్షేమం పట్టదా?

## భద్రతలేని బ్రతుకులు

మైకా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ప్రమాదాల మధ్య పనిచేయాల్సి వస్తోంది. జిల్లాలోని పొదలకూరు, సైదాపురం, గూడూరు, చిల్లకూరు తదితర ప్రాంతాలలో మైకాగనులు, ఓపెన్ కాస్ట్‌గనులు వున్నాయి. ఈ గనుల్లో మైకా, క్వార్జ్, పల్సపర్, వర్మిక్యులేట్, సిలికా, రోడ్డుమెటల్ ఖనిజాలు విస్తారంగా లభిస్తాయి. ఈ గనుల్లో ఖనిజ సంపదను వెలికి తీసేందుకు కార్మికులు పని చేస్తుంటారు. అలాంటి వారి ప్రాణాలకు భద్రత కరువైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూగర్భంలో పనిచేసే కార్మికులకు అన్నిరకాల భద్రతాచర్యలు చేపట్టాల్సి వుంది. అయితే ఏ గని యజమాని కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కార్మికుల పేర్లతో రిజిష్టర్ నిర్వహించడం దగ్గర్నించి వారికి అవసరమైన సేఫ్టీ క్యాంప్‌లైట్, హెల్మెట్, బూట్లు తదితర పరికరాలు అందించాల్సి వున్నా ఎక్కడా వాటిని అందించడం లేదు. మైన్స్ అధికారులు తరచూ ఆయా గనుల్లో తనిఖీలు నిర్వహించాల్సి వుండగా అలాంటి నిబంధనలు అధికారులు పాటించకపోవడంతో కార్మికులకు భద్రత కరువైంది. కొందరు గని నిర్వాహకులు కరెంటు లేకుండానే క్వారీలను నడుపుతున్నారు. కొవ్వొత్తుల వెలుగులోనే కార్మికులు పనిచేయాల్సి వస్తోంది.

## పరిశ్రమలు స్థాపించరేమి?

" అపాచి, ఎస్‌బిక్యూ స్టీల్స్‌నే ప్రారంభం "

జిల్లాలో పరిశ్రమల కోసం ప్రత్యేక ఆర్థికమండళ్ల పేరుతో ప్రభుత్వం 20వేల ఎకరాలు పెద్దలకు అప్పనంగా అందజేసింది. పచ్చనిపొలాలు పరిశ్రమల కోసం పారిశ్రామికవేత్తల చేతుల్లోకి పోయినా ఇంతవరకు ఎక్కడా అవి స్థాపించిన దాఖలాలు లేవు. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్న చందంగా వుంది. పరిశ్రమలు వస్తున్నాయని చెప్పడం తప్ప ఎక్కడా ప్రారంభం కాకపోవడం, నిరుద్యోగులకు ఉపాధి లభించకపోవడంతో దానికోసం ఎదురు చూస్తున్న యువతకు నిరాశే ఎదురౌతున్నది. పరిశ్రమల కోసం తీసుకొన్న పొలాలు అధికభాగం సన్నచిన్నకారు రైతులవి కావడంతో వ్యవసాయ కార్మికుల పరిస్థితి దయనీయంగా వుంది. తడ మండలం మాంబట్టు వద్ద 316 ఎకరాల్లో అపాచి పరిశ్రమను నెలకొల్పారు. ఈ మధ్య చిల్లకూరు ప్రాంతంలో ఎస్‌బిక్యూ స్టీల్ పరిశ్రమ ప్రారంభమయ్యింది. ఇవి తప్ప మరెక్కడా ఏర్పడిన పరిశ్రమలే లేవు. మేనకూరు వద్ద 5600 ఎకరాలు 1500 ఎకరాలు నాయుడుపేట మండలంలో సెజ్‌ల కోసం, రైతుల నుంచి స్వాధీనం చేసుకొన్నారు. టెక్స్‌టైల్ పార్కు కోసం 1100 ఎకరాలు తీసుకొన్నా పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ప్రభుత్వం ఆ భూమిని తర్వాత కెపారో సంస్థకు అప్పగించినా పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలో పలు చోట్ల వివిధ ప్రాజెక్టుల కోసం భూములను ఇచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పరిశ్రమల ఏర్పాటుకు పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులు పొలాలను పోగొట్టుకొని, పనులు లేక కుటుంబ పోషణ కష్టంగామారి అవస్థలు పడాల్సి వస్తోంది. శిలాఫలకాలు చూసి సంతృప్తి చెందడం తప్ప ఆర్థిక మండళ్ల వల్ల ఎవరికీ ప్రయోజనం చేకూరలేదు.

## అక్రమంగా గ్రావెల్‌తవ్వకం!

బోగోలు మండలం కడనూతల పంచాయితీలోని ప్రభుత్వ సీలింగ్ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జెసిబిని ఉపయోగించి భారీ టిప్పర్లు, లారీల ద్వారా ఈ గ్రావెల్‌ను తరలించి వేస్తున్నారు. స్థానికంగా వుండే నాయకుడు ఈ అక్రమ తరలింపులో ప్రధానపాత్ర పోషిస్తుండడంతో వాటిని ఆపేందుకు ఏ అధికారి ప్రయత్నించడం లేదు. ప్రభుత్వ సీలింగ్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరపాలంటే అధికారికంగా అనుమతి పొందాల్సి వుంటుంది. అలాంటి అనుమతులు ఏవీ తీసుకోకుండా బహిరంగంగా యంత్రాలను పెట్టి గ్రావెల్‌ను త్రవ్వి తరలిస్తున్నా ఎవ్వరు అడ్డు చెప్పకపోవడంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా గ్రావెల్ తరలిపోతున్నది.

## కలిచేడులో క్షయాసుపత్రి మూత!

గనిలో పనిచేసే సందర్భాలలో కార్మికులకు క్షయవ్యాధి వచ్చే అవకాశాలు అధికంగా వుంటాయి. బ్లాస్టింగ్ సమయంలో వచ్చే దూళి వల్ల కార్మికులకు క్షయవ్యాధి వ్యాపిస్తుండడంతో సైదాపురం మండలంలోని కలిచేడులో క్షయాసుపత్రిని ఏర్పాటు చేశారు. కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ ఆస్పత్రి కొన్నాళ్లు కొనసాగింది. ఇటీవల కాలంలో ఎందువల్లనో ఆ క్షయాసుపత్రి కాస్త మూతపడింది. దీంతో వైద్య సదుపాయం అందక పలువురు కార్మికులు క్షయవ్యాధితో అనారోగ్యంపాలై ప్రాణాలు పోగొట్టుకొంటున్నారని కార్మికుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కార్మికుల ప్రాణాల కోసం ఆస్పత్రిని తిరిగి తెరిపించి వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం వుంది.

## దగదర్తిలో వడగండ్ల వాన

దగదర్తి మండలంలో గతవారం కురిసిన వడగండ్ల వాన దెబ్బకు గ్రామాలు అతలాకుతలమైనాయి. దామవరం, పెదపుత్తేడు, కౌరుగుంట, దుండిగం, చవటపుత్తేడు తదితర గ్రామాలలో చెట్లు, విద్యుత్తు స్థంబాలు నేలకొరిగాయి. విద్యుత్తుశాఖకు భారీనష్టం చేకూరింది. గత 20 సంవత్సరాలుగా ఇటువంటి వర్షం తాము చూడలేదని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

## విత్తనాల కోసం ఎగబడ్డ రైతులు

మినుము విత్తనాల కోసం వింజమూరు రైతులు వ్యవసాయ కార్యాలయంలోకి జొరబడి తోపులాడుకున్నారు. వింజమూరు మండలానికి 50టన్నుల విత్తనాలు అవసరం కాగా కేవలం పది టన్నులు రావడంతో అవి తమ వరకు రావన్న భయంతో రైతులు తోపులాడుకోవలసిన దుస్థితి నెలకొంది. 176 మంది రైతులకు ఒక్కొక్కరికి 12 కిలోల వంతుల పంచారు. ఈ రచ్చలో కొందరి పాస్‌బుక్కులు గల్లంతయ్యాయి. అందరికీ విత్తనాలు సరఫరా చేస్తామని అధికారులు చెప్పినా రైతులు ఖాతరు చేయలేదు. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దుబాటు చేశారు.

స్మగ్లర్ల కొత్త ఎత్తుగడ

## ఆర్టీసిలో బియ్యం స్మగ్లింగ్

తమిళనాడు నుంచి జిల్లాకు దిగుమతి అవుతున్న బియ్యం అక్రమరవాణాకు స్మగ్లర్లు ఇప్పుడు ఆర్టీసి బస్సులను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు రైళ్లు, లారీల్లో మాత్రమే తరలిస్తూ వస్తున్న అక్రమ వ్యాపారులు ప్రస్తుతం కొత్త పంథా అనుసరిస్తున్నారు. మద్రాస్ నుంచి నెల్లూరు, ఒంగోలు, విజయవాడకు వెళ్లే సూపర్‌లగ్జరీ బస్సుల్లోని డిక్కీల్లో టన్నుల కొద్ది బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు. తమిళనాడులో ప్రభుత్వం కిలో రూపాయికి ఇచ్చే రేషన్ బియ్యాన్ని పలు ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సూళ్లూరుపేటలోని కొందరు స్మగ్లర్లు ఈ బియ్యాన్ని లారీల్లో కర్నాటకకు తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఒకప్పుడు చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే సబర్బన్‌రైళ్లలో చిన్న చిన్న బస్తాల్లో సాగే ఈ వ్యాపారం పెద్ద ఎత్తున లారీల్లో జరుగుతోంది. ఈ క్రమంలో ఆర్టీసి బస్సుల్లో జరిగే ఈ అక్రమ తరలింపులో ఆర్టీసి సిబ్బంది ఈ అక్రమ రవాణాలో పాలుపంచుకొంటున్నారు.

## పంట రుణాలివ్వండి

ఎఎస్‌పేట మండలంలో సిండికేట్ బ్యాంకు పరిధిలో పంటరుణాలు సక్రమంగా ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని సి.భీమవరం, పెద్దబ్బీపురం, చిరమన, చందులూరుపాడు తదితర గ్రామాల రైతులు బ్యాంకు అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. పంటరుణాలు అందజేస్తామని ప్రకటించి చివరకు రుణాలు ఇవ్వమని చెప్తున్నారని దీనిపై బ్యాంకు సిబ్బందిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని రైతులు ఆగ్రహించారు. సిండికేట్ బ్యాంకు పరిధిలో ఖాతాదారుల సమావేశం ఏర్పాటుచేసి ఏడాది అవుతున్నా ఇంతవరకు జరుపలేదని రైతునాయకులు మధుసూధన్‌రావు, సుబ్బరత్నారెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫీల్డ్ ఆఫీసర్ అందుబాటులో వుండకపోవడం, మేనేజర్ వున్నా రుణాలు ఇవ్వకపోవడంతో పంట రుణాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నట్లు వివరించారు. రుణాలు సకాలంలో చెల్లిస్తున్నా తిరిగి రుణాలు అందివ్వడంలో బ్యాంకు సిబ్బంది ముందుకు రావడం లేదని వాపోయారు.



నెల్లూరు కనకమహల్ సెంటర్‌లో రాజా ఫర్నిచర్స్ నూతన షోరూంను ప్రారంభిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, ప్రక్కన మేయర్ భానుశ్రీ, షోరూం అధినేతలు శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు.



నెల్లూరులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నేతృత్వంలో జరిగిన పద సంచలనం.

# కీచక విద్యాశాఖ అధికారిపై విచారణ

కలువాయి మండల విద్యాశాఖాధికారి బాలకృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ హరిజనవాడలో పనిచేసే టీచర్ వినోద ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదుపై నెల్లూరు డిప్యూటీ డిఇవో బంగారయ్య శాఖపరమైన విచారణ జరిపారు. తనకు సంబంధించి ఇంక్రిమెంట్లు మంజూరు చేయించుకొనేందుకు, సర్వీసు రిజిష్టర్ కోసం ఎంఇవో వద్దకు పలుమార్లు తిరిగింది, యూనియన్ నాయకుల సహాయం కోరింది, ఈ పరిస్థితులలో ఆ ఎంఇవో తనను

### చర్యలేమిటో చూడాలి

మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఈ ఏడాది జనవరిలో ఆమె పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. డిఇవో, ఎస్‌పి, జిల్లా కలెక్టర్‌కు, విద్యామంత్రికి విజ్ఞాపనలు పంపించింది. దీంతో భయపడిన ఎంఇవో పలువురిని కలుసుకొని రాయబారం నడిపాడు. ఉపాధ్యాయసంఘ నాయకులు ఎట్టకేలకు ఎంఇవోకు, టీచర్‌కు మధ్య లోక్‌అదాలత్‌లో రాజీకుదిర్చారు. దీనిపై శాఖాపరమైన విచారణ 17తేది చేపట్టారు అధికారులు.

## గూడూరు అభివృద్ధికి 440 కోట్లు!

గూడూరు పట్టణ అభివృద్ధికి 440 కోట్లు నిధులు మంజూరు చేయనున్నట్లు తిరుపతి ఎమ్పీ చింతామోహన్ తెల్పారు. 52 అంతర్గత రోడ్ల మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 24 గంటల్లో గ్యాస్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సైదాపురం, మనుబోలులలో గ్యాస్ ఏజెన్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. గూడూరులో అదనపు హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీకి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రజలకు నాలుగు గంటలపాటు నీరు అందేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఇందుకోసం మరో 62 కోట్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. సిపిఎం నేతలు రమణయ్య, రాబర్టు, చంద్రయ్యలు సమస్యలపై ఎమ్పీకి మెమొరాండం ఇచ్చారు. బాక్సుటైపు బ్రిడ్జిని గూడూరులో ఏర్పాటు చేయాలని ప్రధానంగా పేర్కొన్నారు. ఎమ్పీ పర్యటనలో కమిషనర్ ప్రసాదు, కౌన్సిలర్ నాశిన నాగులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు 34వ డివిజన్‌లో స్వైన్‌ఫ్లూ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తాటి వెంకటేశ్వర్లు, మందా బాల్జి.

తనిఖీలేవీ?

## ● ఆత్మకూరులో కల్తీ పెట్రోలు

ఆత్మకూరు పెట్రోలు బంకుల్లో ఘరానా మోసం జరుగుతుండడంపై మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జడ్పీటిసి సభ్యుడు నాసా పెంచలయ్య మాట్లాడుతూ పెట్రోల్ బంకుల నిర్వాహకులు చేస్తున్న మోసాల వల్ల వినియోగదారులు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. మీటర్ రీడింగ్ సక్రమంగా వున్నట్లు కన్పడుతున్నా వాహనాలలోకి ఇంధనం మాత్రం చాలా తక్కువ మోతాదులో వస్తున్నదని తేల్చి చెప్పారు. పెట్రోలులో కిరసనాయిల్, ఇతరత్రా ఆయిల్ కల్తీ చేస్తున్నారని ఆరోపించాడు. పెట్రోల్, డీజల్‌లో ఇలాంటి మోసాలు అధికం కావడం వల్ల వాహనాలు తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు సభ్యులు ఈ అంశాన్నే సమావేశంలో ప్రస్తావించడంతో అక్కడ వున్న తహశీల్దార్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపడుతామని తెలిపారు.

## మినుము విత్తనాల కొరత

మినుము విత్తనాల కోసం జిల్లావ్యాప్తంగా రైతులు ఎదురుచూడాల్సి వస్తోంది. రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా కాకపోవడంతో రైతులు పలు అవస్థలు పడాల్సి వస్తోంది. గూడూరు డివిజన్‌లోని రైతాంగం మినుము విత్తనాల కోసం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ ఏడాది రైతులు సవక, జామాయిల్ తోటలు నరికి మినుమును సాగు చేయాలని సంకల్పించడంతో అధిక సంఖ్యలో రైతులు వీటికోసం బారులు తీరుతున్నారు. దీంతో మండలంలో షుమారు 10టన్నుల మినుము గింజల అవసరం ఏర్పడింది. వీటిలో సగం మాత్రమే సరఫరా చేయదానికి వ్యవసాయాధికారులు ముందుకు రావడంతో రైతులు ఈ విత్తనాలకోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. పాస్ పుస్తకాల ప్రకారం ఒక్కో రైతుకు 8 కిలోల చొప్పున ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించినా అందరికి చాలడం లేదు. మెట్టసాగు చేసే గ్రామాలలోని రైతులకు మాత్రమే మినుము విత్తనాలు ఇచ్చివుంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.



## రోశయ్య ఎదురుచూపులు

గ్రహాల అనుకూలత కోసం రోశయ్య ఎదురుచూపులు చూస్తున్నాడట. ముఖ్యమంత్రి అయినా ఇంకా ఆర్థికశాఖామంత్రి ఛాంబర్ నుంచే రోశయ్య కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నాడు. సచివాలయంలోని 'సి' బ్లాకులో వున్న సిఎం ఛాంబర్‌కు మారడానికి. జాతకరీత్యా గ్రహాలు అనుకూలంగా లేవట. అందుకే రోశయ్య తటపటాయిస్తున్నాడని ఆయన సన్నిహితవర్గాలంటున్నాయి. అక్టోబర్ మొదటివారంలో గ్రహాలు అనుకూలంగా వున్నాయట. ఆ వారంలో ఏదో ఒకరోజు సిఎం ఛాంబర్‌లో కొలువు కావడానికి రోశయ్య నిర్ణయించుకొన్నాడట. గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీ నాటికి సిఎం ఛాంబర్‌ను సిద్ధం చేయాల్సిందిగా అధికారుల్ని ఆదేశించాడు. ప్రస్తుతం సిఎం ఛాంబర్ ముస్తాబులో అధికారులు తలమునకలై వున్నారు.

## అతివాది అన్న మితవాది తమ్ముడు



ఇద్దరూ అన్నదమ్ములే... అయినా ప్రస్తుతం వారుపోషిస్తున్న పాత్రలు మాత్రం వేరు. జగన్‌కు అనుకూలంగా అన్న వివేకా అతివాదిగా వుంటే... తమ్ముడు రామనారాయణ మాత్రం అటు రోశయ్యకు - ఇటు జగన్‌కు మధ్యేమార్గంగా మితవాదిగా వ్యవహరిస్తున్నాడు. సిఎంగా జగన్ అయినా, లేక రోశయ్య కొనసాగినా ఇబ్బందిలేకుండా వుండేందుకు 'బ్రదర్స్' చేసుకొన్న ప్రత్యేక ఏర్పాటుగా సిఎల్పీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

## దారికొచ్చిన 'జగన్'



ముఖ్యమంత్రి కుర్చీ తప్ప మరే పదవియిచ్చినా తీసుకునేది లేదంటూ భీష్మించిన వైఎస్.జగన్ మొత్తానికి దారికొచ్చినట్లే కనిపిస్తున్నాడు. విశ్రాంతి కోసం బెంగుళూరుకు వెళ్లిన జగన్ అక్కడ వీరప్ప మొయిలీని కలిశాడట. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల్ని వేలెత్తిచూపుతూ జగన్‌ను మందలించాడట మొయిలీ. దాంతో జగన్ కడపకు వెళ్లి పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో బుద్ధిగా పాల్గొన్నాడు. పనిలో పనిగా ఓ ప్రకటన కూడా చేశాడు. అధిష్టానం ఆదేశాలకు తాను లోబడి పనిచేస్తానంటూ ప్రకటించాడు. జగన్‌లో వచ్చిన ఈ మార్పు ఏ మాత్రం అర్థంగాక ఆయన వీరవిధేయులు జుత్తు పీక్కుంటున్నారు.

## 'నన్నపనేని'కి మళ్లీ కోపం వచ్చింది



తెలుగుదేశం ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారికి మళ్లీ కోపం వచ్చింది. రాష్ట్ర కార్యవర్గంలో తనకు స్థానం కల్పించలేదంటూ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడ్ని ఆడిపోసుకుంటోంది. పార్టీలో ఎంతో సీనియర్ అయినప్పటికీ అటు కార్యవర్గంలో కానీ, ఇటు పొలిట్ బ్యూరోలో కానీ తనకు స్థానం కల్పించలేదంటూ 'బాబు'పై ఆక్రోశం వెళ్లగక్కుతోంది. కనీసం పార్టీ ఆఫీసుకు కూడా రానివారికి పెద్ద పీట వేశారని, పార్టీనే నమ్ముకొని అహర్నిశలు కష్టపడుతున్న తనను పూర్తిగా నిర్లక్ష్యం చేశారంటూ 'బాబు'కు వ్యతిరేకంగా మీడియాకు ఎక్కింది. అయితే నన్నపనేనికి ఇది అలవాటేనంటూ పార్టీ వర్గాలు లైట్‌గా తీసుకొంటున్నాయి. దాంతో రాజకుమారికి మరింత చిర్రుబుర్రులాడుతోంది. ప్చ్... రాజకుమారి!!



## అపర కాళిక 'రేణుక'

మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి అపరకాళికగా మారింది. ఖమ్మం పార్టీ కార్యాలయంలో జగన్ మద్దతుదారులు నానా యాగీ చేసి ఫ్లెక్సీ బోర్డుల్ని చించేయడం రేణుకకు కోపం తెప్పించింది. గతంలో సోనియా గాంధీ రాష్ట్రానికి వచ్చినపుడు రేణుకతో పాటు గిరిజన నృత్యంలో పాల్గొన్నది. ఈ సన్నివేశాన్ని ఫోటో తీయించి ఫ్లెక్సీ తయారుచేసి ముచ్చటగా పార్టీ ఆఫీసులో పెట్టింది. అయితే జగన్ మద్దతుదారులు ఈ ఫ్లెక్సీని చించివేయడంతో రేణుకకు అరికాలి కోపం నెత్తికెక్కింది. దీనికి జగనే కారణమంటూ భావించి ఘాటుగా స్పందించింది. పనిలో పనిగా సిఎంగా రోశయ్య అర్హుడంటూ స్టేట్‌మెంట్ యిచ్చింది.



## రూటుమార్చిన విప్లవ కవులు

బూర్జువా వ్యవస్థకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు భావజాలంతో విప్లవ పాటల్ని పాడుకునే కవులు రూటుమార్చారు. వైఎస్ మరణానంతరం ఆయనను కీర్తిస్తూ ఎస్.వేణుగోపాల్ ఏకంగా ఒక వ్యాసాన్ని రాయగా... వంగపండు ప్రసాదరావు 'ఏ పిల్లడో వెళ్దమొస్తవా!' అనే పాటను వైయస్సీకరించి రీమిక్స్ చేశాడు. దీంతో ఈ 'విప్లవకవులకు' ఏమొచ్చిందంటూ సాటి విప్లవకారులు దుమ్మెత్తిపోస్తున్నారు. వైఎస్ కరస్పర్శతో తాను పులకించిపోయానంటూ వేణుగోపాల్ రాసిన వ్యాసానికి రంగనాయకమ్మ నిప్పులు కక్కింది. కాగా విప్లవగీతాన్ని స్వార్థ ప్రయోజనాలకు వాడుకొని వంగపండు కాస్తా దొంగపండయ్యాడంటూ విప్లవ కళాకారులు ధ్వజమెత్తుతున్నారు. ఊహించని ఈ విమర్శలకు వేణుగోపాల్ బహిరంగంగా క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. మొత్తానికి రూటు మారిస్తే ఏమవుతుందో ఈ విప్లవ కవులకు తెలిసొచ్చిందంటున్నారు.



## నిధుల్లేవు - పనుల్లేవు

రాష్ట్ర ఖజానాలో నిధుల్లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు పనుల్లేకుండా పోతున్నాయి. రాష్ట్ర సచివాలయంలో అధికారులు, ఉద్యోగులు ఆటవిడుపుగా వున్నారు. ఖజానాపై ఆంక్షలు విధించడంతో ఒక్క రూపాయిని ఖర్చు చేయాలన్నా కూడా సవాలక్ష నిబంధనలు ఎదురవుతున్నాయని అధికారులంటున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో కూడా కనిపిస్తోంది. సాధారణంగా జిల్లా కలెక్టర్లకు నిధుల్ని ఖర్చు చేసే విషయంలో విచక్షణాధికారాలుంటాయి. అయితే నిధుల స్తంభన వల్ల కలెక్టర్ల చేతులు కట్టేసినట్లుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై నెలకొన్న అయోమయం ఓ కొలిక్కి వచ్చేవరకు ఖజానా పరిస్థితి కుదుటపడే అవకాశాల్లేవని అంటున్నారు.

## మంత్రుల రుబాబు



ముఖ్యమంత్రిని చూస్తే మంత్రులు భయపడతారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో సీను మారింది. ముఖ్యమంత్రి రోశయ్యను చూస్తే మంత్రులకు ఆటవిడుపుగా వుంది. రోశయ్య మంత్రివర్గంలో పని చేయడం ఎంతమాత్రం యిష్టంగా లేదంటూ కొందరు మంత్రులు బహిరంగంగానే చెబుతున్నారు. రోశయ్యను సిఎల్పీ గనక ఎన్నుకుంటే తక్షణం రాజీనామా చేస్తానంటూ మహిళా శిశు సంక్షేమ మంత్రి కొండా సురేఖ బహిరంగంగా ప్రకటించింది. ఆనం రామనారాయణ అయితే రోశయ్యను ఏ మాత్రం లెక్కచేయడం లేదు. పగవాడిక్కూడా యిటువంటి పదవి వద్దంటూ పాపం రోశయ్య తలపట్టుకుంటున్నాడట.

# మగధీర కళాదర్శకుడు నెల్లూరీయుడు!



సతీమణితో రవీంద్ర.



మగధీర సెట్‌లో దర్శకుడు రాజమౌళితో రవీంద్ర

సింహపురి సీమకు చెందిన ఎందరో చిత్రసీమలో దర్శకులుగా, నటులుగా, రచయితలుగా, నిర్మాతలుగా లబ్ధిప్రతిష్టులైన వారు వున్నారు. అలాంటి గడ్డపై పుట్టి యువ కళా దర్శకునిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించినవాడు ఎం.రవీంద్ర. ఆత్మకూరుకు చెందిన ఈ యువ కళాదర్శకుడు ఇటీవల విడుదలై సంచలన విజయం సాధించిన మగధీర చిత్రానికి కళాదర్శకుడిగా బాధ్యతలు నిర్వహించాడు. అలాంటి రవీంద్ర దసరా పండుగకు సొంత ఊరికి వచ్చిన సందర్భంగా పలు విషయాలను చెప్పుకొచ్చాడు.

మాది ఆత్మకూరు. నా విద్యాభ్యాసం అంతా సంగం, ఉదయగిరి, ఆత్మకూరులలో నెల్లూరు సాగింది. ఇంటర్మీడియట్ వీఆర్ కళాశాలలో చదివాను. హైదరాబాద్ జెఎన్‌టియులో ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లమో చేశాను. ఢిల్లీ ఐఐటిలో చదివాక రకరకాల ఉద్యోగాలు చేసి సినీరంగంలో స్థిరపడ్డాను.

అమృతం టివి సీరియల్‌లో కళాదర్శకుడిగా నా జీవితం ఆరంభమైంది. టివి సీరియల్‌లో నా ఆరంగేట్రం జరిగినా 'ఐతే' చిత్రంతో సినీరంగానికి పరిచయం అయ్యాను. దాని తర్వాత ఛత్రపతి, విక్రమార్కుడు, రాఖీ, అష్టాచమ్మా ఒక్కడున్నాడు, నేను మీకు తెలుసా లాంటి పలు చిత్రాలకు కళాదర్శకుడిగా బాధ్యతలు నిర్వర్తించాను. ఈ రంగంలో దర్శకుడు రాజమౌళి ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. ఛత్రపతి సినిమాకు సంబంధించి వేసిన మురికివాడ సెట్ ఎంతో పేరు తెచ్చిపెట్టింది. లేటెస్టుగా మగధీర సినిమా నాకు మంచి బ్రేక్ ఇచ్చింది. అందులో ఉదయ్‌గఢ్ కోట, భైరవ విగ్రహం, రథం, హెలికాప్టర్ అంతా సెట్టింగ్ వేశాము. అన్నీ నిజమా అన్నంతగా వాస్తవికతకు దగ్గరగా ఎంతో శ్రమించి పని చేశాము. మగధీర సినిమా సెట్టింగ్‌కు చాలాకాలం పని చేయాల్సి వచ్చింది. ఆ కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. ప్రస్తుతం అల్లుఅర్జున్ నటిస్తున్న ఆర్య-2, మర్యాదరామన్న సినిమాకు, భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఆధారంగా రూపొందిస్తున్న ఒక హాలీవుడ్ సినిమాకు పని చేస్తున్నాను.

కళా దర్శకునికి కావలసింది ఊహాశక్తి. కేవలం సెట్ వేసినంత మాత్రన ఆర్ట్‌డైరెక్టర్ కాలేదు. అన్ని అంశాలను పరిశీలనలోకి తీసుకొని పని చేయాలి. నా అభిమాన కళా దర్శకుడు తోట తరణి. ఆయనలా పరిశ్రమలో మంచి పేరు తెచ్చుకోవాలన్నదే తన ఆకాంక్ష అన్నాడు రవీంద్ర.

## త్రంకు రోడ్డు కబుర్లు

### తన్నులు తిన్న మీడియా



వివిధ ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్ల మధ్య పోటీ వెర్రితలలు వేస్తున్నది. ఈ వ్యవహారం వివిఐపిలకు పెద్ద తలనొప్పి తెచ్చిపెడుతున్నది. గతవారం పిఎస్‌ఎల్‌వి సి-14 రాకెట్‌ను అంతరిక్ష కేంద్రం షార్ నుంచి ప్రయోగించారు. రాకెట్ ప్రయోగానంతరం శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాల్‌లో జాతీయ మీడియా నుద్దేశించి ఇస్రో ఛైర్మన్ మాట్లాడడం రివాజు. గంటపాటు ఈ ప్రయోగ విశేషాలు చెప్పి షార్‌కు అతిథిగా వచ్చిన ఉపరాష్ట్రపతికి వీడ్కోలు చెప్పను ఉద్యుక్తులయ్యారు ఇస్రో ఛైర్మన్ మాధవన్ నాయర్. కానీ ఒక్కో ఎలక్ట్రానిక్ ఛానల్ తమ లోగో కనిపించేలా ప్రత్యేకంగా మాట్లాడమని ఆయన్ను చుట్టు ముట్టారు. మీడియా... ఏం చేయాలో పాలుపోని ఛైర్మన్‌ను గమ్యస్థానం చేర్చే బాధ్యతలు కేంద్ర పారిశ్రామిక రక్షణ దళాలు తీసుకొన్నాయి. ఇస్రో ఛైర్మన్‌ను చుట్టుముట్టిన మీడియాకు ముష్టిఘాతాలు రుచి చూపించాయి. ఇదే అదనుగా ఇస్రో ఛైర్మన్ సినిమా యువకుని మాదిరి కుర్చీలను దాటుకుంటూ బతుకుజీవుడా అని బ్రహ్మప్రకాష్ హాల్ నుంచి బయటపడ్డారు.

### ఇస్రో సెంటిమెంట్



విశ్వ రహస్యాలను శోధించను రాకెట్ల మీద రాకెట్లు పంపుతున్న ఇస్రో శాస్త్రవేత్తలకు ఓ సెంటిమెంట్ వుంది. శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి రాకెట్ ప్రయోగానికి ముందు రోజు రాత్రి సూళ్లూరుపేట గ్రామదేవత చెంగాళమ్మకు ఇస్రో ఛైర్మన్ సతీ సమేతంగా వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేసివస్తారు. ఇలా చేస్తే రాకెట్ ప్రయోగం విఫలం కాదని వారి నమ్మకం. ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ అయితే కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి చెంత ప్రయోగించే రాకెట్ నమూనా గట్రాలు పెట్టి పూజలు చేసేవారు. చంద్రునిపై నీటి జాడను కనిపెట్టిన శాస్త్రాన్ని అవపోసిన పట్టిన శాస్త్రవేత్తలైనా పుట్టింది సెంటిమెంట్‌కు తలవొంచే దేశంలో గదా?

### దొంగలకు ప్రసన్న రక్ష



కోవూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో స్కూటర్లు, పొలాల్లోని మోటార్లు పెద్ద ఎత్తున చోరీకి గురయ్యాయి. వీటిని చేసింది గంగవరం మాజీ సర్పంచ్ అండ్ గ్యాంగ్. ఈ గ్యాంగ్‌ను నెల్లూరు టూ టౌన్ పోలీసులు వలపన్ని పట్టుకొన్నారు. అంతే తెలుగుదేశం పక్షాన గెలిచి కాంగ్రెస్‌కు వంతపాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పోలీసులకు ఫోన్ చేశారు. వారిని విడిచిపెట్టకపోతే ఇబ్బందిపడాల్సి వస్తుందని హెచ్చరించారు. దీనితో మరో మార్గం లేక దొంగలను విడిచిపెట్టేశారు పోలీసులు. ఈ విషయం తెలుగుదేశం పార్టీ నాయకులకు తెలిసినా మిన్నకుండిపోవడం చర్చనీయాంశమయ్యింది.

### జగన్‌కు ముంగమూరు... జై!



రాష్ట్రంలో ఈమధ్య ఎక్కువగా వినిపిస్తున్న నినాదం ఏదైనా వుందంటే 'జగన్‌కు జై' అని చెప్పవచ్చు. దీనిని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు చేస్తే పట్టించుకోవనిలేదు. కాని ప్రజారాజ్యం పార్టీ తరపున నెల్లూరు నగర ఎమ్మెల్యేగా గెలిచిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేస్తుండడమే చర్చనీయాంశమౌతున్నది. నగరంలోని 14వ డివిజన్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన వైఎస్ సంతాప సభకు శ్రీధరకృష్ణారెడ్డి హాజరయ్యారు. "నేను ప్రజారాజ్యం పార్టీలో వుంటే వున్నానుగానీ వైఎస్ జగనే సిఎం కావాలని నా మనసు కోరుకొంటున్నది. ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం ప్రగతి పథాన పయనిస్తుందని" తెగపొగడడంతో ఆ సభలోనే వుండిన ఆనం వివేకా సైతం అవాక్కయ్యారు.

### అరవయాగీ దళం



సంతోషం, విషాదాల సమయంలో తమిళ సోదరులు ప్రదర్శించే అతిభావావేశాన్ని అరవయాగీగా పేర్కొంటుంటారు. నెల్లూరు రాజకీయాలను తమ చిత్తం వచ్చిన రీతిలో నడిపే ఆనం సోదరులు అన్నిచోట్లా తాము వేసే ఎత్తులు రక్తికట్టను ఓ అరవయాగీ దళాన్ని సైతం సిద్ధం చేశారు. ఆనం సోదరుల స్వగ్రామానికి చెందిన ఈ దళంలోని మహిళలు సందర్భాన్నిబట్టి అరచి గీపెట్టి, ఏడ్చి నానా హంగామా చేస్తారు. ఈవారంలో పిసిసి పిలుపు మేరకు పార్టీ సభ్యత్వ కార్యక్రమం చేపట్టను వచ్చిన నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జి, శాసనమండలి సభ్యుడు రుద్రరాజు పద్మరాజు ఇందిరాభవన్‌లో ఈ అరవయాగీ దళం దెబ్బకు హతాశుడైనాడు. ఈ రచ్చగూర్చి చెప్పను పిసిసి అధ్యక్షుడికి ఫోను చేయబోతే ఆయనా ఎత్తుకోలేదు. పాపం... పద్మరాజు!

# 49వ డివిజన్‌లో పారిశుధ్యం పాతర!

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన డివిజన్‌లలో అభివృద్ధి పనుల విషయంలో స్తబ్దత ఏర్పడింది. కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గం సభ్యులు ఎవరు కూడా అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదు. మునిసిపాలిటీ నుండి కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశించిన నగరవాసులకు చివరకు నిరాశే మిగిలింది. నగరంలో పారిశుధ్యం, డ్రైన్లు, త్రాగునీటి సమస్య, సిమెంటు రోడ్లు లేకపోవడం తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఇందుకు ఉదాహరణగా 49వ డివిజన్‌ను పేర్కొనవచ్చు. ఈ డివిజన్ కార్పొరేటర్‌గా స్వతంత్ర అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ మునాఫ్ 2005 సంవత్సరంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ ఎన్నికల్లో గెలుపొంది తర్వాత ఆనం వర్గంతో చేరిపోయాడు. గెలిచిన నాటి నుంచి తనను గెలిపించిన డివిజన్ ప్రజల గురించి మాత్రం పట్టించుకోవడం మానేసి ఆనం వర్గం చేపట్టే కార్యక్రమాలలో బిజీగా కనపడుతుంటాడు. ఈ డివిజన్‌లో త్రాగునీటి సమస్య, ఇళ్ల స్థలాల సమస్య, పారిశుధ్యం, డ్రైన్లు తదితర సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి.

ఈ డివిజన్ పరిధిలో రంగనాయకుల పేట, పొర్లుకట్ట, ఇసుకడొంక, గొల్లవీధి తదితర ప్రాంతాలున్నాయి. వీధులలో వేసిన చెత్తా, చెదారాన్ని ప్రతిరోజు కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది తొలగించడం లేదు. దీంతో కుక్కలు, పందులు చేరి స్వైరవిహారం చేస్తుంటాయి. దీంతో ఎక్కడ అంటు వ్యాధులు వ్యాపిస్తాయోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. కార్పొరేటర్‌గా గెలిచి నాలుగు సంవత్సరాలు పూర్తయినా డివిజన్‌లో ఏనాడు పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకొన్న దాఖలాల్లేవు. స్థానికంగా చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు తయారు చేసి పనుల మంజూరుకు కృషి చేయలేదు.

ఈ నేపథ్యంలో డివిజన్‌లో సమస్యలు, చేపట్టిన పనుల గురించి స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.



**పారిశుధ్యం అధ్వాన్నం!**

డివిజన్‌లో పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయి. శానిటరీ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది మధ్య విభేదాలు ఏర్పడిన కారణంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులకు అనేక దఫాలు విన్నవించుకున్నా పట్టించుకొన్నవారు లేరు.

- మైనుద్దీన్



**దోమల బెడద అధికం**

డివిజన్‌లో దోమల బెడద అధికంగా వుంది. వీధుల్లో వేసిన చెత్తా చెదారాన్ని సిబ్బంది తొలగించకపోవడం వల్ల దోమలు చేరుతున్నాయి. ఇంతే కాకుండా డ్రైనేజి కాల్వలు కూడా చాలా అధ్వాన్నంగా వున్నాయి. మురికినీరు వీధులలో ప్రవహిస్తున్నది.

- సుబ్బారావు



చెత్త తొట్లను శుభ్రపరిచే తీరికలేదు.



నీళ్లురాని బోరు.

**అవినీతి కథ**

# కార్పొరేషన్‌లో మరో స్వాహా పర్వం!




నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం.

ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరి, పాలకవర్గ వైఫల్యం కారణంగా లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిపోతోంది. సిబ్బంది కొరతను సాకుగా చూపి కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకుంటూ వారికి ప్రతినెల చెల్లించాల్సిన జీతాలు చెల్లించకుండా దిగమింగుతున్నారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు పదవీ విరమణ చేసినా ఆయా పోస్టులు భర్తీ కావడం లేదు. దీంతో కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకుంటున్నారు.

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌ను ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. పదవీ విరమణ చేసిన వారి స్థానంలో బయట సొసైటీల నుంచి కంప్యూటర్, రికార్డుల నిర్వహణకు సంబంధించిన సిబ్బందిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకునే విషయంలో అధికారులు, క్రిందిస్థాయి సిబ్బంది ఆరితేరిపోయారు. సొసైటీల నుంచి కొంతమందిని, బయట నుంచి మరికొంతమందిని నియమించుకోవడం జరిగింది. మునిసిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలలో దాదాపు వంద మందికి పైగా కాంట్రాక్టు సిబ్బంది పనిచేస్తున్నారు.

కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకున్న సిబ్బందికి నెలకు 4,500 రూపాయలు వేతనంగా చెల్లించే విధంగా ముందుగా అంగీకారం కుదుర్చుకుంటారు. అయితే దీనికి సంబంధించి రాతపూర్వకంగా అగ్రిమెంట్లు ఏమీ వుండవు. ఉద్యోగంలో చేరిన కాంట్రాక్టు సిబ్బందిచేత నిర్దీత సమయం మించి పనులు చేయించుకుంటున్న అధికారులు జీతం మాత్రం ప్రతినెల చెల్లించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోరు. సకాలంలో జీతం ఇవ్వకపోవడం కారణంగా కొంత మంది కాంట్రాక్టు సిబ్బంది రెండు, మూడు నెలలు పనిచేసి, వేరే ఉద్యోగం వెతుక్కొని వెళ్లిపోతుంటారు.

ఇటువంటి వారి వల్ల అధికారుల జేబుల్లోకి వారి జీతాలు చేరిపోతున్నాయి. వేరే ఉద్యోగం దొరక్క కార్పొరేషన్ కార్యాలయంలోనే పనిచేస్తున్న మిగిలిన కాంట్రాక్టు సిబ్బందికి 7, 8 నెలలకు జీతాలు మంజూరుచేసి మూడు నెలలకే వేతనాలు చెల్లిస్తున్నారు. ఇటువంటి సంఘటనల కారణంగా కాంట్రాక్టు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా మరింత ఇబ్బంది పడుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఇటువంటి అవినీతి, అక్రమాలు అధికంగా చోటుచేసుకొంటున్న విషయం పైస్థాయి అధికారులకు తెలిసినా కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి.

కాంట్రాక్టు సిబ్బందికి చెల్లించాల్సిన జీతాలు ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్వాహా చేస్తున్నా సిబ్బంది ఎవరికీ చెప్పుకోలేక పోతున్నారు. కార్పొరేషన్ పాలకవర్గం దృష్టికి కాంట్రాక్టు సిబ్బంది వేతనాలు స్వాహా చేస్తున్న సంగతి తెలిసినప్పటికీ తమకెందుకులే అన్నవిధంగా మిన్నకుండి పోతున్నారు. ప్రజాధనం దుర్వినియోగం జరుగుతున్నా ఒక్కరు కూడా దీనిపై మాట్లాడకపోవడం బట్టి చూస్తుంటే ఎంత చిత్తశుద్ధితో కార్పొరేషన్‌లో పరిపాలన సాగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పాలకవర్గంలోని అధికార పక్షానికి చెందిన సభ్యులు అవినీతి అధికారులకు అండగా నిలుస్తున్నారు.

**[ నెల్లూరు కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల్లో పనిచేయను వందమందికి పైగా కాంట్రాక్టు కార్మికులున్నారు. వీరి జీతాలను సక్రమంగా చెల్లించక అధికారులు స్వాహా చేస్తున్నారు. ]**

కార్పొరేషన్ కార్యాలయంలో ఎవరు ఏం చేసినా అడిగే నాథుడు లేకపోవడం వల్ల అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం, కార్పొరేషన్ కమిషనర్ కలుగజేసుకొని కాంట్రాక్టు సిబ్బంది జీతాలు స్వాహా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

## ఓర్పే శరణ్యం

మొదటి పేజీ కొరవ

అదుపుతప్పి పోతుందన్న అభిప్రాయానికి వచ్చేశారు ఢిల్లీ పెద్దలు. జగన్‌కు ఎట్టి పరిస్థితులలోనూ అవకాశం ఇవ్వకూడదన్న నిర్ణయానికి వచ్చేశారు. ఒత్తిడి పెంచేకొద్దీ వారిలో పట్టుదల మరింత పెరిగిందే తప్ప, అనుకూలత లభించ లేదు.

ఈ పరిస్థితులలో అధిష్టానానికి తలదించడం తప్ప వేరే ప్రత్యామ్నాయం ఏమీలేదని అర్థమైపోయింది. ఎమ్మెల్యేల వీరావేశానికి భ్రమసి పార్టీ మీద తిరుగుబాటు చేస్తే నష్టపోయేది తానే అన్న ఆలోచనకు వచ్చేశాడు జగన్. ఎంత లెక్క వేసినా అధిష్టానాన్ని ధిక్కరించి అయినా తనతో నిలబడే ఎమ్మెల్యేలు, మంత్రుల సంఖ్య 60 నుంచి 70కి మించకపోవచ్చునని తేలిపోయింది. ఢిల్లీ నుంచి సందేశం వచ్చి తనను ముఖ్యమంత్రిగా నియమిస్తే 150 మంది వరకు తన వెంట వుంటారని; ఢిల్లీ అభిమతానికి వ్యతిరేకంగా పదవి చేపట్టడానికి ప్రయత్నం చేస్తే ఈ సంఖ్య నగానికంటే తక్కువకు పడిపోతుందని; ఆ పరిస్థితులలో ప్రజారాజ్యం, మజ్లిస్, టిఆర్ఎస్ వంటి పార్టీల సహకారం తీసుకొన్నా తనకు చాలినంత మెజార్టీ రాకపోవడం ఒక సమస్య అయితే, తనతోపాటు తిరుగుబాటు ప్రకటించిన ఎమ్మెల్యేల మీద పార్టీ ఫిరాయింపుల చట్టం వేటుపడి పరిస్థితి మరింత హీనంగా మారుతుందని భయపడుతున్నాడు జగన్. తిరుగుబాటు చేసి అటు పార్టీని, ఇటు ముఖ్యమంత్రి పదవిని శాశ్వతంగా వదులుకోవడం కంటే, అధిష్టానం మనసు కరిగి తనను అనుగ్రహించే వరకు ఎన్ని నెలలైనా, అవసరమైతే సంవత్సరాలైనా ఓర్పు పట్టడమే సరైన మార్గమనే నిర్ణయానికి వచ్చాడని తెలుస్తున్నది. కెవిపి రామచంద్రరావు సలహా కూడా అదే అని చెప్తున్నారు. ఆ నిర్ణయంతోనే ఆయన కడప జిల్లాలో కాంగ్రెస్ సభ్యత్వాల కార్యక్రమంలో స్వయంగా పాల్గొనబోతున్నట్లు ప్రకటించాడు.

జగన్ కోసం వీరావేశం ప్రదర్శించిన ఎమ్మెల్యేలందరికీ అశనిపాతం వంటి నిర్ణయం ఇది. ఎట్టి పరిస్థితులలో జగన్ ముఖ్యమంత్రి అవుతాడనే నమ్మకంతో ఆయన అనుగ్రహం కోసం తమ శక్తికిమించిన ఆవేశం ప్రదర్శించిన ఎమ్మెల్యేలు ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితిలో పడిపోతున్నారు. తన పదవి ప్రయత్నం పక్కనపెట్టి, ఈ వీరవిధేయుల రాజకీయ ప్రయోజనాలు కాపాడడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది జగన్‌కు. కొత్త ముఖ్యమంత్రి రోశయ్యతో వీరి కోసం బేరసారాలు నడపడానికి తప్పదాయనకు.

## మూడు ఉపఎన్నికలు

16వ పేజీ కొరవ

వీరు ముగ్గురికంటే అధికంగా ఇరకాటంలో పడినవాడు కోవూరు తెలుగుదేశం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. రాజశేఖర్‌రెడ్డి చల్లని చూపులతో తన దరిద్రమంతా ఒకేసారి వదిలించుకోవాలన్న ఆశతో గెలిచిన పక్క నెలలోనే తెలుగుదేశం మీద తిరుగుబాటు చేశాడు. అందుకు ప్రతిగా ఇస్తానని చెప్పిన మొత్తంలో కొంత భాగం అడ్వాన్స్ మాత్రమే ముట్టిందట. ఈలోగా వైఎస్ అనంతలోకాలకు వెళ్లిపోయాడు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటన్న దిగులుతో చిక్కి సగమైపోయివున్నాడు ప్రసన్నకుమార్‌రెడ్డి. వస్తాయనుకొన్న సొమ్ములు పూర్తిగా చేతికి అందలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమానంగా అధికారం చలాయించవచ్చుననుకొంటే అదిప్పుడు జరగదు. అటు నేదురుమల్లి జనార్ధనరెడ్డి కానీ, ఇటు ఆనం రామనారాయణరెడ్డి కానీ ఆయనకు ఆశయం ఇవ్వరు. తెలుగుదేశంలోకి మళ్లీ వెళ్లే పరిస్థితి లేదు. రెంటికీ చెడిన రేవడివలె మిగిలిపోయాడు పాపం. ఏ చిన్న అవకాశం దొరికినా తెలుగుదేశం పార్టీ ఆయన్ను పార్టీ ఫిరాయింపుల చట్టం క్రింద అనర్హుడిగా ప్రకటింపచేస్తుంది. వైఎస్ బ్రతికి వుంటే ఆ ప్రమాదం రాకుండా జాగ్రత్తపడేవాడు. ఇప్పుడు ఆయన కోసం అంత శ్రమ తీసుకొని, రక్షణ కల్పించే కాంగ్రెస్‌వాది ఎవడూ లేడు. వున్నదీ పోయే వుంచుకున్నదీ పోయే అని విలపించడం తప్ప ప్రసన్నకుమార్‌రెడ్డి చేయగల్గింది ఏదీ లేదిప్పుడు.

## మొత్తబుద్ధేస్తుంది

16వ పేజీ కొరవ

ధంతో వ్యవహరించడం లేదు. దాని ఫలితం అటు ప్రభుత్వపరంగా, ఇటు రాజకీయంగా కూడా కన్పడి పోతున్నది. కొండా సురేఖ వంటి జూనియర్ మంత్రులు తమ నోటికి వచ్చినట్లు మాట్లాడడానికి కారణం అదే. తన మాటలు అధిష్టానానికి వ్యతిరేకం అని తెలిసినా, ముఖ్యమంత్రి మనసు నొచ్చుకుంటుందని తెలిసినా ఆమె ప్రతి రోజూ ఏదో ఒక సందర్భంలో తనకు రోశయ్య క్యాబినెట్‌లో వుండడం ఇష్టం లేదని ప్రకటన చేస్తున్నది. కొందరు ఎమ్మెల్యేలు అదిపనిగా వెటకారం మాటలు మాట్లాడుతున్నారు. తన క్యాబినెట్‌లో వుండడం ఇష్టం లేదని బహిరంగంగా ప్రకటించిన మంత్రులను ఒక్క సంతకంతో పీకి పారేసే అధికారం ముఖ్యమంత్రికి వుంది. కానీ ఆయన ఆ సాహసం చేయలేక పోతున్నాడు.

ఇటువంటి వాచాలత్వం ప్రదర్శించే మంత్రులు ఒకరిద్దరికి ఉద్వాసన పలికి, గట్టిగా పని చేసే ఐఎఎస్ అధికారులను కీలకశాఖలలో నియమిస్తే అందరు మంత్రులూ దారికి వస్తారు. మంత్రులు లొంగివస్తే ఎమ్మెల్యేలు కూడా కాళ్ల బేరానికి రాక తప్పదు. ముఖ్యమంత్రి కాదు అనుకుంటే ఏ కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా తన నియోజకవర్గంలో వీసమెత్తు పని చేసుకోలేడన్నది జగమెరిగిన సత్యం. కలెక్టర్లు, ఎస్పీలు సహకరించకుంటే ఎమ్మెల్యేలు వుత్తి భద్రయ్యలుగా మిగలక తప్పదు. ఏ కలెక్టర్ కూడా ముఖ్యమంత్రి మనసుకు విరుద్ధంగా పని చేయలేడు.

తన కోసం కాకపోయినా, కనీసం పార్టీలో, ప్రభుత్వంలో క్రమశిక్షణ కోసమైనా రోశయ్య గారు ముఖ్యమంత్రి పదవిలోని శక్తిని వాడి చూపించాలని అందరి అభిలాష. ఆయనలో ఆ పట్టుదల, నిబద్ధత వచ్చేంతవరకు రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఇట్లా సంక్షుభితంగానే వుంటుంది. ఎమ్మెల్యేల వాచాలత్వం ఇదే తీరులో నడుస్తుంది. ఒక్కసారి కొరడా ఝుళిపిస్తే తప్ప ఈ అరాచక ధోరణులు అదుపులోకి రావు. ఆ కాఠిన్యం ఆయనలో వచ్చేంత వరకు, ఎన్ని రోజులు ముఖ్యమంత్రిగా వుండినా దండగే.

## జనవాణి

2వ పేజీ కొరవ

వంటి వాస్తవిక కారణాలపై దృష్టి పెట్టక పంటల విస్తీర్ణం తగ్గిపోతోందని, అన్ని చోట్ల ధరల పెరుగుదల వుందనే అవాస్తవిక కారణాలను పాలకులు చెప్పడం వారి అసమర్థతను చాటిచెబుతుంది.

కె.సునీత, నెల్లూరు

### స్వైన్‌ఫ్లూ పని పట్టండి

రాష్ట్రమంతటా స్వైన్‌ఫ్లూ, విష జ్వరాలతో జనం అల్లాడిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అచేతనావస్థలో వుంది. ప్రకటనలతో కాలయాపన చేస్తోంది. తక్షణం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, పంచాయితీల పరిధిల్లో చెత్తాచెదారాలు తక్షణం ఎత్తివేయడం తోపాటు డ్రైనేజీలు శుభ్రపరచాలి. క్రిమి సంహారక మందులు స్ప్రే చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మరిస్తే ఎలా?

ఎం.సుధామయి, నెల్లూరు

### నెల్లూరు డిఎస్పీకి అభినందనలు

చిత్తశుద్ధితో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా విధ్యుక్తధర్మాన్ని నిర్వహిస్తున్న నగర డిఎస్పీ రాధికకు అభినందనలు. బియ్యం స్మగ్లర్లను లారీలతో సహా పట్టుకొని ప్రభుత్వ ఖజానాకు భారీ మొత్తాన్ని జమచేసేలా చూసిన ఆమెను ఉన్నతాధికారులు మందలించి వారి బుద్ధిని లోకానికి చాటారు. 'జమీన్‌రైతు'లో వ్రాసినట్లు జన అభినందనలకన్నా మిన్న ఏమీ లేదని డిఎస్పీగారు గ్రహించి ముందుకు సాగిపోవాలని మనఃపూర్తిగా కోరుకొంటున్నాను.

కాకుటూరు సుజాత, కావలి

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ర్థులు ఐదవ నంబరు జాతీయ రహదారిపై తమ సమస్యలు పరిష్కరించమని ధర్నాకు దిగగా, పోలీసులు వారిపై లాఠీఛార్జి చేశారు. పోలీసులు అకారణంగా తమను కొట్టారని ఇంజనీరింగ్ విద్యార్థులు చేసిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సుభాషణ్‌రెడ్డి స్పందించి గూడూరు డిఎస్పీ నారాయణరెడ్డికి నోటీసు జారీ చేశారు.

## పోస్టల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు!

జిల్లాలోని పోస్టాఫీసుల్లో ఖాళీగా వున్న 33 పోస్టల్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి తపాలాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంటర్ మీడియట్ చదివి 18 నుండి 25 ఏళ్లలోపు వయస్సున్న వారు ఈ పోస్టుకు అర్హులు. అప్లికేషన్‌ను 25 రూపాయలు చెల్లించి అన్ని పోస్టాఫీసులలో కొనుగోలు చేయవచ్చుంటున్నారు నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్వీ శివప్రసాద్.

## ఇంగ్లాడులో నదియా నృత్య ప్రదర్శన

నెల్లూరు నర్తకి కుమారి నదియాకు యూరోపియన్ తెలుగు అసోసియేషన్ వార్షికోత్సవాలను పురస్కరించుకొని లండన్‌లో నృత్య ప్రదర్శన చేసే అరుదైన అవకాశం దక్కింది. లండన్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న తొలి నెల్లూరు నర్తకిగా నదియాను అభివర్ణించవచ్చు.

## ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో చలమయ్య!

చెన్నైలో జరిగిన ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికల్లో సంఘం కార్యవర్గ సభ్యునిగా నెల్లూరు వర్తక ప్రముఖుడు కె.వి.చలమయ్య ఎన్నికయ్యారు.

## నర్రవాడలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

నర్రవాడలో 36వ అంతర్‌జిల్లాల బాల బాలికల కబడ్డీ పోటీలను మాజీ మంత్రి మాదాల జానకిరాం చొరవతో విజయవంతంగా నిర్వహించారు. బాలుర విభాగంలో తూర్పుగోదావరి, ప్రకాశం, చిత్తూరు, కృష్ణాజిల్లాల జట్లు వరుసగా మూడు స్థానాల్లో నిలువగా, బాలికల విభాగంలో కృష్ణా, ప్రకాశం, పశ్చిమగోదావరి, గుంటూరు జట్లు నిలిచాయి. మొదటి బహుమతిగా 50వేలు, ద్వితీయ బహుమతిగా 30వేలు, తృతీయ బహుమతిగా 20వేల రూపాయలను గెలుపొందిన జట్లకు మాదాల జానకిరాం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వీరలంకయ్య, పారిశ్రామికవేత్త బొల్లినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రాజా ఫర్నిచర్ ప్రారంభం

నెల్లూరు కనకమహల్ సెంటర్‌లో రాజా ఫర్నిచర్స్ నూతన షోరూంను 24వ తేది రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్లు సందానిబాష, చాట్ల నరసింహారావు, రాజా ఫర్నిచర్స్ అధినేతలు శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో చెవర్లెట్ కార్ల షోరూం

నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లో చెవర్లెట్ ఫోర్ వీలర్ షోరూంను 28వ తేది ఒంగోలు ఎమ్పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సరయు హీరోహోండా ఆథరైజ్డ్ డీలర్స్‌గా పేరుగాంచిన రాజ్‌కుమార్, దిలీప్ చక్రవర్తి సోదరులు ఇండీవర్ కంపెనీ చెవర్లెట్ కార్లకు నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు అధీకృత డీలర్లు కావడం ఆనందించాల్సిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మేయర్ భానుశ్రీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

## కాపునాడుకు కొత్త కార్యవర్గం!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు జిల్లా అధ్యక్షునిగా మల్లు రామయ్య, ప్రధాన కార్యదర్శిగా గూడంశెట్టి దొరబాబు నియమితులయ్యారు. మల్లు రామయ్య ఇదివరకు రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తుండేవారు. దొరబాబు ఈ సంఘంలో కార్యకర్తగా నిరుపమాన సేవలందించబట్టే ఈ పదవులకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు పిల్లా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

### కొరడా ఝుళిపించకుంటే రోశయ్య ఎన్ని రోజులున్నా అంతే!

# మెత్తగా వుంటే మొత్తబుద్దేస్తుంది!



కొత్త ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పట్ల ఆయన మంత్రులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ అసంతృప్తికి గురి చేస్తున్నది. ఎవరికీ సంతృప్తి కలిగించడం లేదు. ముఖ్యమంత్రి పదవి నిర్వహించడం చేతకాని అసమర్థుడేమీ కాదు రోశయ్య. యాభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ, పరిపాలనా అనుభవంతో పండి పోయిన వాడాయన. ఎందరో ముఖ్యమంత్రులను అతి దగ్గర నుంచి చూసిన వాడు. ముఖ్యమంత్రులతో సమానంగా పాలనా బాధ్యతలు పంచుకొన్నవాడు. అన్ని శాఖలతో ఆయనకు పరిచయం వుంది. దాదాపుగా సెక్రటేరియట్‌లో వుండే ఐఎఎస్ అధికారులందరి గురించి క్షుణ్ణంగా తెలుసు. కాంగ్రెస్‌వాదుల సంగతి చెప్పనే అవసరం లేదు. జిల్లా స్థాయి కార్యకర్తలను కూడా పేరు పెట్టి పిలవగలరు. ఏ కీలు నొక్కితే ఏ మంత్రి పాదాక్రాంతమౌతాడో, ఏ ఫైలుకు ముడి పెడితే ఏ అధికారి కాళ్లబేరానికి వస్తాడో బాగా తెలిసినవాడు. వయస్సు రీత్యా కూడా ఆయనకు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో పెద్దరికం వుంది. సీనియర్ నేతలు కూడా ఆయన్ను గౌరవిస్తారు. జూనియర్లైతే గురువుగా భావిస్తారు.

అన్నింటికీ మించి అధిష్టానం ఆశీస్సులు ఆయనకు పుష్కలంగా వున్నాయి. సోనియాగాంధీ, అహ్మద్ పటేల్, ప్రణబ్ ముఖర్జీ, జైపాల్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, చిదంబరం వంటి నేతలంతా ఆయనకు తమ పూర్తి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా వున్నారు. ఆయన్ను స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోమని, ప్రభుత్వం మీద పట్టు సంపాదించమని వత్తిడి తెస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రి కాకూడదని కోరుకొనే వారు, జగన్ అయితే తమకు రాజకీయభవిష్యత్తు వుండదనుకొనే వారు ఎమ్మెల్యేలలో చాలామంది వున్నారు. వారందరూ ఆయనకు అండగా నిలవడానికి సిద్ధంగా వున్నారు. చూసి రమ్మంటే కాల్చి వచ్చే ఉత్సాహంతో ఉరకలేస్తున్నారు. కనీసం యాభై మంది ఎమ్మెల్యేలు కొత్త ముఖ్యమంత్రికి మద్దతుగా నిలవడానికి సిద్ధంగా వున్నట్లు అంచనా.

ఇన్ని అనుకూలతలు, అవకాశాలు వుండికూడా ఎందువల్లనో రోశయ్య గారు తమ పదవిలో తాను పూర్తి స్థాయిలో కుదురుకోవడానికి మీన మేషాలు లెక్కిస్తున్నారు. ముఖ్యమంత్రి అధికార కార్యాలయమైన సి బ్లాక్‌లోకి వెళ్లడానికి ఆయనకు ఇంకా ముహూర్తం కుదరలేదు. ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీని, ఇతర అధిష్టాన పెద్దలను కలిసి రావడానికి చొరవ చూపడం లేదు. తన పేషీలోకి అధికారుల నియామకం కూడా చేయడం లేదు. వచ్చే ఎన్నికల వరకు ఆయన్ను ముఖ్యమంత్రిగా కొనసాగించాలనే ఉద్దేశం అధిష్టానానికి వున్నా లేక పోయినా కనీసం మరికొన్ని నెలలపాటు ఆ పదవిలో ఆయన్నే ఉంచుతారన్న సంకేతాలు ఢిల్లీ నుంచి స్పష్టంగా వెలువడుతున్నాయి.

ముఖ్యమంత్రిగా తన అస్థిత్వాన్ని నిరూపించుకోవడానికి ఇంతకంటే అనుకూలతలు వేరేమీ అవసరం లేదు. కానీ ఏ కారణం వల్లనో ఆయన ఆ దృక్ప

కొరవ 14వ పేజీలో



నెల్లూరు గాంధీనగర్ సాయిబాబా మందిరంలో బాబా విజయదశమి మహాసమాధి ఉత్సవాలలో భాగంగా బాబా వారికి పూజా కార్యక్రమాల నిర్వహణలో మందిర ఛైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి.



నెల్లూరు ట్రంకురోడ్డులో హోటల్ సుందర్‌భవన్ నిర్వాహకుడు స్వర్గీయ గడ్డం సుందరరామిరెడ్డి మనవడు అమ్మ ఫర్నిచర్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి కుమారుడు సుమన్‌రెడ్డి, దివ్యల వివాహం సెప్టెంబర్ 24వ తేది ఎ.యల్.రావు కళ్యాణ మండపంలో జరిగింది.

### ● మాటమీద నిలబడితే

# మూడు ఉపఎన్నికలు

జగన్‌ను ముఖ్యమంత్రి చేయకుంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తామని వీరావేశంతో ప్రకటనలు చేసిన కాంగ్రెస్‌వాదులు ఇప్పుడు ఇరకాటంలో పడిపోయారు. మన జిల్లాకు సంబంధించి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నోటికి హద్దే లేకుండా వుండే ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి శేఖర్‌రెడ్డి ఏ కారణం చేతనో నోరు జారాడు. జగన్ ముఖ్యమంత్రి కాకపోతే తనతో పాటు తన అన్న నెల్లూరు పార్లమెంటుసభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి సైతం రాజీనామా చేస్తాడని ప్రకటించాడు. ఇప్పుడు జగన్ ముఖ్యమంత్రిత్వం జరిగే







పోయింది. జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయం అన్న అంచనాతో, ఆయన మెప్పుపొందడానికి భరించలేని వాచాలత్వం ప్రదర్శించాడు. జగన్ కోసం ఎమ్మెల్యే పదవి ఒకటేమిటి, అవసరమైతే ప్రాణాలైనా అర్పిస్తామన్నట్లు వీరావేశం చూపాడు. తమ్ముడు ఆనం రామనారాయణరెడ్డి మాత్రం గోడ మీద పిల్లి వలె అటు ఇటు నొప్పి తగలకుండా, జగన్ అయినా, రోశయ్య కొనసాగినా తన ఉనికికి ప్రమాదం లేకుండా జాగ్రత్తపడ్డాడు కానీ వివేకాలో ఆ నిగ్రహం కన్పించలేదు. ఎప్పుడూ వత్రికలకు దూరంగా పనికాదని తేలిపోయింది. కనీసం కొన్ని నెలలపాటు ఆ అంశం పరిశీలనకు వచ్చే అవకాశం లేదు. దాని అర్థం మాట మీద నిలబడేవారే అయితే, వీరు ముగ్గురూ రాజీనామా చేయాలి. మూడు స్థానాలకు ఉపఎన్నికలు జరగాలి. అయితే రాజకీయవాదుల మాటలు, నీటి మీద వ్రాతల వంటివి కాబట్టి వారు అంత త్యాగం చేస్తారని భావించలేము. ఆరునెలలు కూడా గడవక ముందే పదవులు వదులుకొనేంత అవ్యక్తులు కారు వీరు.

కొరవ 14వ పేజీలో



నెల్లూరు కొండాయపాళెం వసంతోపు సెంటర్ మానస ఆగ్రోటెక్ షోరూంను ప్రారంభిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. ప్రక్కన నిర్మల నరసింహారెడ్డి, షోరూం అధినేత కె.నారాయణరెడ్డి వున్నారు.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.